ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

# vaartha sandhya వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 199 మంగళవారం 07 - 07 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 199 Tuesday 07 - 07 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

## ముఖ్యమంత్రి ఆఫీసు ఉండే ఫ్లోర్ కు భోజనం కట్

- రెండేళ్లుగా బిల్లులు చెల్లించని ప్రభుత్వం!
- తెలంగాణ సచివాలయంలో నిలిచిపోయిన క్యాటరింగ్ సేవలు
- సీఎం, సీఎస్ కార్యాలయాలు ఉండే ఆరో ఫ్లోర్ కు అల్పాహారం, భోజనం సరఫరా బంద్
- దాదాపు రెండేళ్లుగా కాంట్రాక్టర్‌కు కోట్లలో బిల్లులు పెండింగ్
- బకాయిలు చెల్లించకపోవడంతో చేతులెత్తేసిన క్యాటరింగ్ నిర్వాహకుడు




## జకార్తాలో మోదీకి అరుదైన గౌరవం




- ఇండోనేషియాకు చేరిన ప్రధాని మోదీ
- స్వయంగా వచ్చి ఆహ్వానించిన అధ్యక్షుడు ప్రబోవో
- యుద్ధ విమానాలతో మోదీ విమానానికి ఎస్కార్ట్
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చలు
- ప్రంబనన్ ఆలయ సముదాయం సందర్శించనున్న మోదీ

**వార్త సంధ్య, ఢిల్లీ, జులై 06 :** మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఇండోనేషియా రాజధాని జకార్తాకు చేరుకున్నారు. రెండు రోజుల పర్యటన కోసం అక్కడి చేరుకున్న ఆయనకు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో స్వయంగా విమానాశ్రయానికి వచ్చి స్వాగతం పలకడం విశేషం. ఇరు దేశాల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలకు ప్రతీకగా ఈ ప్రత్యేక ఆతిథ్యాన్ని - మిగతా 2 లో

## రష్యా బాల్టిక్ పోర్టులపై ఉక్రెయిన్ డ్రోన్లతో దాడి

- భారత్‌కు చమురు వచ్చేది ఇక్కడి నుంచే!
- డ్రోన్ల శకలాలు పడి ఉస్ట్-లుగా, వైసోట్స్క్ ఓడరేవులకు నష్టం
- రష్యా ఇంధన మౌలిక సదుపాయాలే లక్ష్యంగా దాడులు
- ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపిన రష్యా అధికారులు



**వార్త సంధ్య, ఢిల్లీ, జులై 06 :** ఉక్రెయిన్ డ్రోన్ దాడుల నేపథ్యంలో రష్యాలోని రెండు కీలక బాల్టిక్ సముద్ర నౌకాశ్రయాలు దెబ్బతిన్నాయి. కూల్చివేసిన డ్రోన్ శకలాలు పడటం వల్ల ఈ నష్టం వాటిల్లిందని రష్యా అధికారులు సోమవారం వెల్లడించారు. ప్రధానంగా రష్యా యుద్ధ వ్యయానికి ఆర్థిక వనరులుగా ఉన్న ఇంధన మౌలిక సదుపాయాలను - మిగతా 2 లో

## మహారాష్ట్రలో వర్ష బీభత్సం

- పుణేలో కొండచరియలు విరిగిపడి ముగ్గురి మృతి
- ముంబై-పుణే రాకపోకలు బంద్
- ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో కొనసాగుతున్న సహాయక చర్యలు
- ముంబై సహా పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ



**వార్త సంధ్య, ఢిల్లీ, జులై 06 :** మహారాష్ట్రలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాలు పెను విషాదాన్ని సృష్టించాయి. పుణే జిల్లాలో సోమవారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడటంతో పలు ఇళ్లు శిథిలాల కింద కూరుకుపోయాయి. ఈ ఘోర దుర్ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. మరోవైపు, భారీ వర్షాల నేపథ్యంలో ముంబై నగరానికి భారత వాతావరణ శాఖ (ఐఎండీ) 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. - మిగతా 2 లో

## కాళేశ్వరం అవినీతిపై రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారు



- తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు
- కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు ఆడుతున్నాయన్న రాంచందర్ రావు
- జాతీయ డ్యాం భద్రతా సంస్థ హెచ్చరించినా మరమ్మతులు చేపట్టలేదని విమర్శ
- హైడ్రా కేవలం పేదల ఇళ్లను టార్గెట్ చేస్తోందని మండిపాటు

**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 06 :** జనసంఘ్ స్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తదితర నేతలు - మిగతా 2 లో



## బీజేపీ నేతలు రాముడి హుండీలోని సొమ్మును కూడా లూటీ చేశారు

- తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- అయోధ్య రామ మందిర విరాళాల సేకరణలో భారీ అవినీతి జరిగిందన్న పొన్నం ప్రభాకర్
- ఈ స్కామ్ కు మోదీ, అమిత్ షా, యోగి బాధ్యత వహించాలని డిమాండ్

**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 06 :** అయోధ్య రామ మందిర విరాళాల సేకరణలో కోట్ల రూపాయల భారీ అవినీతి జరిగిందంటూ తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజకీయ - మిగతా 2 లో

## అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తెలంగాణ

- సీఎం రేవంత్ కీలక ఆదేశాలు
- పర్యాటక రంగంపై సీఎం రేవంత్ ఉన్నతస్థాయి సమీక్ష
- తెలంగాణను అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యం
- తారామతి బారాదరి, దుర్గం చెరువు అభివృద్ధికి ఆదేశాలు
- వికారాబాద్, వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధిపై దృష్టి
- మరిన్ని ఎకో పార్కులు, ఫ్యూచర్ సిటీలో అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టులు
- పురానాపూల్‌ను పర్యాటక కేంద్రంగా మార్చే ప్రతిపాదన
- ట్రాఫిక్ మళ్లించి బ్రిడ్జిలపై పర్యాటకుల కోసం ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు



**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 06 :** తెలంగాణను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ దిశగా ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యాటక శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. తారామతి బారాదరిని ప్రముఖ పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలని, దుర్గం చెరువును పూర్తిస్థాయి టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్‌హౌస్‌లను ఆధునీకీకరించాలని చెప్పారు. టూరిజం హబ్ - మిగతా 2 లో

## ఆర్టీజీ కేంద్రం నుంచి ఇక 24 గంటల సేవలు

- సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు
- ప్రజా సమస్యలపై రియల్ టైమ్‌లో స్పందించాలని అధికారులకు సీఎం ఆదేశం
- పీజీఆర్ఎస్ కింద పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి
- పట్టణ ప్రాంతాల్లో జీరో వేస్ట్ లక్ష్యంగా మూడు నెలల్లో చెత్త తొలగింపు
- గంజాయిపై ఉక్కుపాదం మోపాలి, మహిళల భద్రతకు పెద్దపీట
- మారుమూల గ్రామాల్లో కమ్యూనికేషన్ టవర్ల ఏర్పాటుకు కార్యాచరణ




**వార్త సంధ్య, అమరావతి, జులై 06 :** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై రియల్ టైమ్‌లోనే స్పందన ఉండాలని, ప్రభుత్వ సేవల్లో వేగాన్ని పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఐదు రోజుల జిల్లాల పర్యటన ముగించుకుని అమరావతికి చేరుకున్న ఆయన, సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) కేంద్రంలో ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. పురపాలక, పంచాయితీరాజ్, హోం, ఎక్సైజ్ వంటి కీలక శాఖల పనితీరు, ప్రజా సేవల్లో నాణ్యతపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. వేగంగా స్పందించగలిగితేనే పౌరులకు మెరుగైన సేవలు అందించగలమని, పాలనలో జవాబుదారీతనం పెరుగుతుందని ఆయన అన్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రం నుంచి ప్రజలకు వాస్తవ సమయంలోనే స్పందన అందాలని చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖ సముద్ర తీరంలో బోటు మునిగి మత్స్యకారులు గల్లంతైన ఘటనను ఉదాహరణగా చూపుతూ, - మిగతా 2 లో

## రావణ్‌తో వైసీపీకి ఎలాంటి సంబంధాలు లేవు




- అంబటి రాంబాబు
- కక్ష సాధింపులకు పోలీసులను ప్రభుత్వం వాడుకుంటోందన్న అంబటి
- సాధారణ యూట్యూబర్ రావణ్‌పై దేశద్రోహం చట్టాలను ప్రయోగించారని మండిపాటు
- రావణ్‌కు న్యాయ సహాయం అందిస్తామని వెల్లడి



## 'మావిగన్' గురించి జగన్ మాట్లాడాలనుకుంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి

- బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు
- అమరావతిని రాజధానిగా కేంద్రం ప్రకటించిందన్న విష్ణుకుమార్ రాజు
- జగన్ రాజకీయ కుట్రలు చేస్తున్నారని విమర్శ
- సర్ పేరుతో ఓట్లు తొలగించడం లేదన్న బీజేపీ ఎమ్మెల్యే

**వార్త సంధ్య, అమరావతి, జులై 06 :** ఏపీ రాజధానిగా అమరావతిని కేంద్రం ప్రకటించిన తర్వాత కూడా 'మావిగన్' అంటూ వైసీపీ అధినేత జగన్ వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ - మిగతా 2 లో

# సంపాదకీయం

## మరో ఎదురుదెబ్బ

అమెరికాలో పుట్టిన పిల్లలందరూ అమెరికన్లే అంటూ సుప్రీంకోర్టు బల్లగుద్ది తీర్పుచెప్పడంతో ఆత్మరక్షణలో పడిన డోనాల్డ్ ట్రంప్ మరో ప్రతిపాదనతో సరికొత్త వివాదానికి సిద్ధపడుతున్నారు. గర్భవతులైన ఇతరదేశాల మహిళలను అమెరికాలో కాలూనకుండా నిలువరించడం ద్వారా, జన్మతః పౌరసత్వాన్ని రద్దుచేయాలన్న తన ఆశయాన్ని నెరవేర్చుకోవచ్చునని ఆయన ఆలోచన. అమెరికాలో పుట్టే పిల్లల హక్కులకు సంబంధించిన వివాదం ఇకపైన గర్భధారణ, ప్రయాణాలు, పౌరసత్వం, ఆ దేశంలో పర్యటించే లేదా ప్రవేశించే హక్కు ఇత్యాది అనేక అంశాల చుట్టూ తిరగవచ్చు.అత్యంత వివాదాస్పదమైన తన ఆదేశాలను కోర్టులు కొట్టివేస్తాయని ట్రంప్‌కు తెలియకపోదు. చట్టబద్ధంగా నడుచుకోవడం, న్యాయంగా వ్యవహరించడం ఆయనకు ముఖ్యం కాదు. తన రాజకీయప్రయోజనాల పరిరక్షణే ఆయనకు ప్రధానం. న్యాయస్థానాల్లో ఎదురుదెబ్బలు తింటున్నప్పుడల్లా ఆయన న్యాయమూర్తులను నిందిస్తూ, తాను అమెరికాను గ్రేట్ చేయబోతూంటే వీరంతా అడ్డుపడుతున్నట్టుగా వ్యాఖ్యానిస్తూంటారు. తాను అనుకున్నది సాధించడానికి మరిన్ని అడ్డదారులు వెతుకుతుంటారు. అమెరికా పౌరులకు జన్మతః దఖలుపడిన హక్కులను వేరేతోవలో ఎవరెవరో వచ్చి తన్నుకుపోతూంటే అధ్యక్షులవారు చూస్తూ ఊరుకోరు అని వైట్‌హౌస్ ప్రతినిధి నుంచి ట్రంప్ అనుచరగణం వరకూ అంతా చెబుతున్నారు. కేవలం తమ పిల్లలకు అమెరికా పౌరసత్వం దక్కడం కోసం అక్కడకు వెళ్ళి ప్రసవించే వారి విషయంలో ఏమిచేయాలో, కఠినంగా ఎలా వ్యవహరించాలో తేల్చేపని అయితే గట్టిగానే సాగుతోంది. అమెరికాలో ఏటా జరిగే ప్రసవాలతో పోల్చినప్పుడు ఈ 'బర్త్‌టూరిజం' బేబీలసంఖ్య అతిస్వల్పమే. అయినప్పటికీ అమెరికన్ల హక్కుల పరిరక్షణకోసం తాను ఎంతటి తీర్పునైనా వమ్ముచేస్తానని చెప్పుకోవడం కోసం ఆయన రాజ్యాంగాన్ని ధిక్కరిస్తూనే ఉంటారు.దేశాధ్యక్షుడుగా రెండోసారి ప్రమాణం చేసిన మరుక్షణం ట్రంప్ జారీ చేసిన ఈ ఉత్తర్వులను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అమెరికా ఔన్నత్యం, రాజ్యాంగఆశయాలు, ఆదర్శాలను ఏకరువుపెట్టారు. అమెరికా పౌరసత్వం గొప్పదనం, ఆ గడ్డమీద పుట్టే ప్రతి ఒక్కరికీ సర్వహక్కులూ దక్కుతాయన్న రాజ్యాంగ రూపకర్తల హామీలు, 14వ రాజ్యాంగ సవరణను పరిరక్షించాల్సిన తమ కర్తవ్యం గురించి లోతుగా విశ్లేషించారు. అమెరికాలో పుట్టినందుకు సర్వహక్కులూ సిద్ధించడంతో పాటు, అక్కడి రాజకీయవ్యవస్థల్లో స్వేచ్ఛగా భాగస్వామ్యం పొందేందుకు ఈ సవరణ వీలుకల్పిస్తోందని కూడా కోర్టు గుర్తుచేసింది. కార్యనిర్వాహక ఆదేశాలతో రాజ్యాంగ మౌలికసూత్రాలను వమ్ముచేయడానికి ట్రంప్ చేసిన ప్రయత్నాన్ని అది అడ్డుకుంది. పుట్టుకతో వచ్చే పౌరసత్వాన్ని ఎవరూ కాదనలేరని పద్నాల్గవ రాజ్యాంగ సవరణ ఆధారంగా నిగ్గుతేల్చి, తదనంతర దేశాధ్యక్షులు సైతం అటువంటి సాహసానికి పూనుకోకుండా నిరోధించింది. దానిని రద్దుచేసే ఏ ప్రయత్నానికైనా ఉభయసభల్లో మూడింట రెండువంతుల బలం కావాలి. రాష్ట్రాల ధ్రువీకరణకు సైతం హెచ్చు సంఖ్యాబలం అవసరం.ఇమ్మిగ్రేషన్ నియమాల విషయంలో ఉన్న గందరగోళాన్నీ, చీటికీమాటికీ జరుగుతున్న మార్పులతో ఏర్పడిన మరింత అభద్రత గల వాతావరణాన్ని కోర్టు ఈ దెబ్బతో సరిచేసింది. ఈ తీర్పు అనేకదేశాలవారికి, ప్రధానంగా భారతీయులకు మేలు చేస్తుందని విశ్లేషకులు అంటున్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న వలస సమూహాల్లో భారతీయ సంతతి జనాభా ఒకటి. హెచ్1బి, ఎల్1, ఎఫ్1 ఇత్యాది అనేక రకాల వీసాలతోనూ, అక్రమంగానూ ఆ దేశంలో నిత్యం బతుకుభయంతో ఉంటున్న లక్షలాదిమందికి ఈ తీర్పు మంచి ఊరట. జన్మతః పౌరసత్వ హక్కుకు స్వస్తిపలకాలని కృతనిశ్చయంతో ఉన్న అమెరికా అధ్యక్షుడు వేరుమార్గాల్లో, మారురూపాల్లో తన పోరాటాన్ని ఎలాగూ కొనసాగిస్తూనే ఉంటారు. నవంబరులో ఉన్న మధ్యంతర ఎన్నికలు ఆయనకు ఎక్కడలేని శక్తినీ ఇస్తాయి. రెండుసార్లు అభిశంసనకు గురై, నలభై అపరాధాలు రుజువైన ట్రంప్‌కు అవమానం కొత్తేమీ కాదు. అమెరికాను ఉన్నతంగా నిలబెడతానంటూ దానికి ఉన్న ఆ కాస్త విలువలనూ ఒలిచిపారేసే పనిలో ఉన్నారాయన.

### 'మావిగన్' గురించి జగన్ మాట్లాడాలనుకుంటే

## అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి

**మొదటిపేజీ తరువాయి -** రాజు విమర్శించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతికి మద్దతుగా మాట్లాడిన జగన్... 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు రాజధానులు అని మాట మార్చారని మండిపడ్డారు. అమరావతే రాజధాని అని అన్ని పార్టీలు ఒప్పుకున్న తర్వాత కూడా జగన్ రాజకీయ కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుండటం చూడలేక జగన్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విష్ణుకుమార్ రాజు అన్నారు. మావిగన్ గురించి మాట్లాడాలనుకుంటే... అసెంబ్లీలో చర్చించాలని, బయట ప్రెస్ మీట్లు పెట్టడం సరికాదని సూచించారు. రుషికొండ భవనాలను ప్రజలందరికీ ఉపయోగపడేలా వినియోగించాలని చెప్పారు. 'సర్' పేరుతో ఎవరి ఓట్లు తొలగించడం లేదని అన్నారు.


## అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి -** డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలని, అక్కడి వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి యాదాద్రి తరహాలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పర్యావరణహిత పర్యాటకానికి ప్రాధాన్యమిస్తూ 'క్యూర్' పరిధిలోని అటవీ భూములను 'ఎకో టూరిజం' కింద అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో మరిన్ని ఎకో పార్కులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ ప్రాంతాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ ప్రాజెక్టుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు.పాతబస్తీలోని చారిత్రక పురానాపూల్ వంతెనను ప్రత్యేక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. అవసరమైతే అక్కడి ట్రాఫిక్‌ను మళ్లించి పర్యాటక జోన్‌గా మార్చాలని అధికారులకు తెలిపారు.

## ముఖ్యమంత్రి ఆఫీసు ఉండే ఫ్లోర్ కు భోజనం కట్

**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణ సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) ఉండే ఫ్లోర్ కు క్యాటరింగ్ సేవలు నిలిచిపోయాయి. గత రెండేళ్లుగా కాంట్రాక్టర్‌కు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడంతో ఆయన సరఫరాను నిలిపివేశారు. ఈ పరిణామంతో సచివాలయంలోని ఉన్నతాధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.సచివాలయంలోని ఆరో అంతస్తులో ఉండే ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కార్యాలయాల సిబ్బంది పాటు ఇతర ఉన్నతాధికారులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఫలహారాలు అందించే సేవలకు అంతరాయం ఏర్పడింది. పేరుకుపోయిన బకాయిలను కనీసం వాయిదాల పద్ధతిలోనైనా విడుదల చేయాలని కాంట్రాక్టర్ పలుమార్లు విన్నవించినప్పటికీ, అధికారులు స్పందించకపోవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.ఈ బకాయిలు కోట్ల రూపాయల్లో ఉండటంతో ముడిసరుకులు కొనుగోలు, సిబ్బంది జీతాల చెల్లింపు భారంగా మారి కాంట్రాక్టర్ చేతులెత్తేసినట్లు సమాచారం. రాష్ట్రంలో వివిధ విభాగాలకు చెందిన కాంట్రాక్టర్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్న ఆందోళనల నడుమ ఈ ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది. ఇటీవల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వంటి సీనియర్ నేతల హామీతో కాంట్రాక్టర్లు తమ నిరసనలను వాయిదా వేసుకున్న విషయం తెలిసిందే. అయితే, ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయానికే ఆహార సరఫరా నిలిచిపోవడం గమనార్హం.

## రష్యా బాల్టిక్ పోర్టులపై ఉక్రెయిన్ డ్రోన్లతో దాడి



**మొదటిపేజీ తరువాయి -** లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ ఈ దాడులకు తెగబడింది.లెనిన్‌గ్రాడ్ ప్రాంతంపై ఉక్రెయిన్ ప్రయోగించిన 56 డ్రోన్లను కూల్చివేసినట్లు ఆ ప్రాంత గవర్నర్ అలెగ్జాండర్ డ్రోజ్‌డెంకో వెల్లడించారు. అయితే, ఆ శకలాలు పడటంతో ఉస్ట్-లుగా, వైసోట్స్క్ నౌకాశ్రయాల్లోని కీలక సదుపాయాలు పాక్షికంగా దెబ్బతిన్నాయని అధికారులు పేర్కొన్నారు. రష్యా చమురు ఎగుమతులకు ఉస్ట్-లుగా అతిపెద్ద కేంద్రం కాగా, వైసోట్స్క్ పోర్టు ద్వారా చమురుతో పాటు ధాన్యం, బొగ్గు, సహజవాయువు ఎగుమతులు జరుగుతాయి. భారత్‌కు సైతం ఇక్కడి నుంచే ముడి చమురు సరఫరా అవుతుండటం గమనార్హం.రష్యా ఇంధన ఎగుమతులను అడ్డుకోవడం ద్వారా ఆ దేశ ఆదాయ వనరులను దెబ్బతీయాలనే వ్యూహంతో ఉక్రెయిన్ వరుస దాడులకు పాల్పడుతోంది. ఈ దాడుల ప్రభావంతో క్రిమియాలోని రష్యా 'బ్లాక్ సీ ఫ్లీట్' కేంద్రమైన సెవాస్టోపోల్‌లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. అయితే, నౌకాశ్రయ పరిసరాల్లో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని రష్యా అధికారులు స్పష్టం చేశారు.

# ఆర్టీజీ కేంద్రం నుంచి ఇక 24 గంటల సేవలు




**మొదటిపేజీ తరువాయి -** ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో వివిధ ప్రభుత్వ విభాగాలు ఎంత తక్షణమే సమన్వయంతో స్పందించాయన్నదే కీలకమని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం మధ్య సమన్వయం కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) ఆధ్వర్యంలో తరచూ మల్టీ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేషన్ సమావేశాలు జరగాలని సూచించారు. ఆర్టీజీ కేంద్రం 24 గంటలూ ప్రజలకు సేవలందించేలా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని నిర్దేశించారు."ఏఐ మెథడాలజీ ద్వారా చిత్తూరు జిల్లాలో సంతృప్తి స్థాయి నమోదు చేస్తున్నాం. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయడం వల్ల ప్రజాభిప్రాయం నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. నియోజకవర్గ స్థాయిలో 'లాస్ట్ మైల్ గవర్నెన్స్' ప్రజలకు అందాలి. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాపాలనలో పొలిటికల్ మేనేజ్‌మెంట్, బ్యూరోక్రటిక్ యాక్షన్ సమపాళ్లలో ఉండాలి," అని ముఖ్యమంత్రి విశ్లేషించారు.

**పీజీఆర్ఎస్ పరిష్కారానికి యాక్షన్ ప్లాన్**

పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సీఎం చంద్రబాబు గట్టిగా ఆదేశించారు. వివిధ కేటగిరీలు, శాఖలకు చెందిన పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ఒక పక్కా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఆర్థిక, ఆర్థికేతర అంశాలుగా విభజించి, ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారం చూపాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా కలెక్టర్లు, ఉన్నతాధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు.

**పట్టణాల్లో 'జీరో వేస్ట్' లక్ష్యం**

రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పేరుకుపోయిన 23 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను రాబోయే మూడు నెలల్లోగా యుద్ధప్రాతిపదికన తొలగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో 'జీరో వేస్ట్' సాధించడమే మన లక్ష్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ బృహత్కార్యంలో ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములై శ్రద్ధ పెట్టాలని కోరారు. క్షేత్రస్థాయిలో తాగునీరు, వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ రథాలు, ఇంటింటికీ చెత్త సేకరణ వంటి కార్యక్రమాలపై నిర్దిష్ట ప్రామాణిక కార్యాచరణ విధానం జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో గంజాయి ముఠాలను పూర్తిగా నియంత్రించాలని, వాటిపై ఉక్కుపాదం మోపాలని హోం శాఖ అధికారులకు సీఎం నిర్దేశించారు. కేంద్ర ప్రభుత్వం 'డ్రగ్ ఫ్రీ కంట్రీ' లక్ష్యంతో పనిచేస్తోందని, దానికి అనుగుణంగా రాష్ట్రంలో గంజాయి నిర్మూలనకు గట్టి చర్యలు తీసుకోవాలని అన్నారు. గంజాయి నిర్మూలనపై తీసుకుంటున్న చర్యల సమాచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. అదే సమయంలో మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాలని, వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కూడా సూచించారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ద్వారా ఎలాంటి ఫలితాలు సాధిస్తున్నామో ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవాలని, పాలనలో పొదుపు మంత్రాన్ని పాటించాలని అధికారులకు హితవు పలికారు. మారుమూల ప్రాంతాల్లో కమ్యూనికేషన్ నెట్‌వర్క్ కనెక్టివిటీ కోసం టవర్లను ఏర్పాటు చేసేందుకు టెలికాం ఆపరేటర్లతో మాట్లాడి కార్యా చరణ చేపట్టాలన్నారు.ఈ సమీక్షా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారధి, సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, పురపాలక,ఎక్సైజ్,పోలీసు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రావణ్‌తో వైసీపీకి ఎలాంటి సంబంధాలు లేవు



**మొదటిపేజీ తరువాయి -** ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమి ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని వాడుకుంటూ ప్రతిపక్షాలే లక్ష్యంగా రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతోందని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసీపీ నేతలతో పాటు సోషల్ మీడియా యాక్టివిస్టులు, రాజకీయ విశ్లేషకులను భయభ్రాంతులకు గురిచేసేందుకే అక్రమ కేసులు, అరెస్టుల పర్వానికి తెరలేపారని ఆయన మండిపడ్డారు.వివాదాస్పద యూట్యూబర్ రావణ్ (జోసెఫ్), కేవీఆర్ వంటి వారికి తమ వైసీపీతో ఎలాంటి ప్రత్యక్ష సంబంధాలు లేవని అంబటి స్పష్టం చేశారు. అయినప్పటికీ ఒక సాధారణ యూట్యూబర్‌పై దేశద్రోహం, 'ఉపా' వంటి కఠిన చట్టాలను ప్రయోగించడం ప్రభుత్వ దురహంకారానికి నిదర్శనమన్నారు. చట్ట పరిధి దాటి ప్రవర్తిస్తే చర్యలు తీసుకోవచ్చు కానీ, దారుణమైన సెక్షన్లు పెట్టడం ఏంటని ప్రశ్నించారు.రావణ్‌ను శారీరకంగా అంతమొందించే ప్రయత్నాలు కూడా జరిగాయని అంబటి సంచలన ఆరోపణ చేశారు. ఈ కేసులో పిఠాపురం కోర్టుతో పాటు పలు న్యాయస్థానాలు రావణ్‌కు అనుకూలంగా తీర్పులు ఇచ్చినా ప్రభుత్వం తన మొండి వైఖరిని మార్చుకోవడం లేదన్నారు. రావణ్ తమ పార్టీ వ్యక్తి కాకపోయినప్పటికీ, బాధితుడిగా అతనికి వైసీపీ తరపున అవసరమైన పూర్తి న్యాయ సహాయాన్ని అందిస్తామని ప్రకటించారు.కేవీఆర్ అరెస్టు వ్యవహారంలో ఏపీ పోలీసులు కనీస చట్టపరమైన నిబంధనలు పాటించలేదని... అందుకే దౌర్జన్యంగా ప్రవర్తించిన ఏపీ పోలీసులపై ఏకంగా తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో సోషల్ మీడియాపై అధికారిక దౌర్జన్యకాండ సాగుతోందని అంబటి విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే కొందరు వ్యక్తులు అత్యంత అసభ్య పదజాలంతో ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నా... వారిపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, చట్టం అందరికీ ఒకేలా ఎందుకు వర్తించడం లేదని నిలదీశారు.

## బీజేపీ నేతలు రాముడి హుండీలోని సొమ్మును కూడా లూటీ చేశారు



**మొదటిపేజీ తరువాయి -** ఎదుగుదల కోసం దేవుడిని వాడుకోవడంలో బీజేపీ పరాకాష్ఠకు చేరిందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలు తమ స్తోమతకు తగినట్లుగా రామయ్య గుడి కోసం విరాళాలు ఇస్తే, కమలం పార్టీ నేతలు ఆ సొమ్మును కూడా వదలకుండా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు."బీజేపీ నాయకులు శ్రీరాముడి పేరును, అక్షింతలను అడ్డం పెట్టుకుని ఇళ్ల వెంట తిరిగి విరాళాలు వసూలు చేశారు. తీరా చూస్తే ఆ నిధుల్లోనే కోట్లాది రూపాయల అవినీతికి తెరలేపారు. దేవుడి హుండీలోని సొమ్మును సైతం లూటీ చేయడం దేశ ప్రజలందరినీ అవమానించడమే" అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నేతల అసలు రంగును, వారి అవినీతి అక్రమాలను అక్కడి స్థానిక ప్రజలు ముందే గుర్తించారని... అందుకే అయోధ్య పరిధిలోని లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థిని అక్కడి ఓటర్లు ఓడించి బుద్ధి చెప్పారని పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు.భక్తి వేరు, రాజకీయం వేరని స్పష్టం చేసిన మంత్రి... ఈ విరాళాల కుంభకోణానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌లదే పూర్తి బాధ్యతని అన్నారు. దేవుడి పేరుతో సాగించిన ఈ పెద్ద స్కాంపై బీజేపీ తక్షణమే స్పందించాలని, దేశ ప్రజలందరికీ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. భక్తి ముసుగులో రాజకీయ వ్యాపారం చేసే శక్తులను ప్రజలు ఇకనైనా గుర్తించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

## కాళేశ్వరం అవినీతిపై రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారు



**మొదటిపేజీ తరువాయి -** ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. దేశ సమైక్యత కోసం ముఖర్జీ చేసిన త్యాగాలు మరువలేనివని ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు.ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పొలిటికల్ డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. జాతీయ డ్యాం భద్రతా సంస్థ హెచ్చరించినా మరమ్మతులు చేపట్టకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకుంటే.. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఆ అవినీతిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీశారు.మరోవైపు హైడ్రా కూల్చివేతల తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. హైడ్రా కేవలం పేదల ఇళ్లను టార్గెట్ చేస్తోందని... ఎంఐఎం నేతలకు చెందిన ఫాతిమా విద్యాసంస్థల అక్రమ కట్టడాలపై కోర్టులు తప్పుబట్టినా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్-ఎంఐఎం దోస్తీ వల్లే ఈ పక్షపాతమని... హైడ్రా అందరికీ ఒకే చట్టాన్ని వర్తింపజేయాలని, లేనిపక్షంలో విపక్షాల అక్రమాలపై రాష్ట్రవ్యాప్త పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.

## జకార్తాలో మోదీకి అరుదైన గౌరవం



**మొదటిపేజీ తరువాయి -** భావిస్తున్నారు.భారత ప్రధాని ప్రయాణిస్తున్న ప్రత్యేక విమానం ఇండోనేషియా గగనతలంలోకి ప్రవేశించిన వెంటనే ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ఎస్కార్ట్ చేశాయి. జకార్తా విమానాశ్రయంలో సంప్రదాయ ఇండోనేషియా నృత్య ప్రదర్శనలతో మోదీకి ఆత్మీయ స్వాగతం లభించింది.ఈ పర్యటనలో మోదీ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. భారత్-ఇండోనేషియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం, వాణిజ్యం, రక్షణ, సముద్ర భద్రత, పెట్టుబడులు, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించడంపై ఇరువురు నేతలు చర్చించనున్నారు.పర్యటనకు ముందు విడుదల చేసిన ప్రకటనలో 2018లో భారత్-ఇండోనేషియా సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా అభివృద్ధి చేశామని మోదీ గుర్తు చేశారు. ఈ భాగస్వామ్యం తర్వాత తన తొలి ద్వైపాక్షిక పర్యటన ఇదేనని పేర్కొన్నారు. అలాగే ఈ ఏడాది గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రబోవో పర్యటనకు కొనసాగింపుగానే ఈ భేటీ జరుగుతోందని తెలిపారు.ఇండోనేషియాలోని భారతీయ ప్రవాసులతో మోదీ సమావేశం కానున్నారు. అలాగే ప్రబోవోతో కలిసి యోగ్యకర్తలోని ప్రసిద్ధ ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శించనున్నారు. ఈ ఆలయం భారత్-ఇండోనేషియా సాంస్కృతిక బంధానికి ప్రతీకగా నిలుస్తుందని మోదీ పేర్కొన్నారు.ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య రక్షణ, సముద్ర భద్రత రంగాల్లో సహకారం మరింత బలపడింది. బ్రహ్మోస్ క్షిపణుల విక్రయం, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రత, సైనిక శిక్షణ, రక్షణ పరిశ్రమల్లో భాగస్వామ్యం విస్తరిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత్-ఇండోనేషియా ద్వైపాక్షిక వాణిజ్యం 24.78 బిలియన్ డాలర్లకు చేరగా, 130కి పైగా భారత కంపెనీలు ఇండోనేషియాలో పెట్టుబడులు పెట్టాయి.ఇండోనేషియా పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో పర్యటించనున్నారు.

## మహారాష్ట్రలో వర్ష బీభత్సం



**మొదటిపేజీ తరువాయి -** వివరాల్లోకి వెళితే.. పుణే జిల్లాలోని మావల్ తహసీల్ పరిధిలోని పటాన్ గ్రామంలో సోమవారం తెల్లవారుజామున 4:25 గంటల సమయంలో కొండ చరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో సుమారు ఐదు ఇళ్లు శిథిలాల కింద సమాధి అయ్యాయి. 30 నుంచి 35 మంది శిథిలాల కింద చిక్కుకున్నట్లు భావిస్తుండగా, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భారీ వర్షాల కారణంగా గ్రామంలో మూడు వేర్వేరు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయని, ఒక ఘటనలో ఇల్లు కూలి ముగ్గురు మరణించారని డీఎస్పీ గజానన్ టోంపే తెలిపారు.సమాచారం అందుకున్న వెంటనే జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) రంగంలోకి దిగింది. పుణేలోని 5వ బెటాలియన్‌కు చెందిన 30 మంది సభ్యుల ప్రత్యేక బృందం సహాయక చర్యలు చేపట్టిందని ఏఎన్ఐ వార్తాసంస్థ తెలిపింది. ఇప్పటివరకు రెండు మృతదేహాలను వెలికితీశామని, మూడో మృతదేహం కోసం గాలింపు కొనసాగుతోందని ఎన్డీఆర్ఎఫ్ అధికారి ఒకరు తెలిపినట్లు పీటీఐ వార్తాసంస్థ పేర్కొంది.కొండచరియలు విరిగిపడటంతో ముంబై-పుణే ఎక్స్‌ప్రెస్‌వే, పాత ముంబై-పుణే హైవేలపై వాహనాల రాకపోకలను అధికారులు పూర్తిగా నిలిపివేశారు. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఈ మార్గాల్లో ప్రయాణించవద్దని ప్రజలకు సూచించారు. ప్రతికూల వాతావరణం దృష్ట్యా అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని పోలీసులు హెచ్చరిక జారీ చేశారు. రెండు నెలల క్రితమే ప్రారంభమైన 13 కిలోమీటర్ల ముంబై-పుణే ఎక్స్‌ప్రెస్‌వే మిస్సింగ్ లింక్ మార్గంలో కూడా రాకపోకలు ప్రభావితమయ్యాయి.ముంబైలో జనజీవనం అస్తవ్యస్తం.. 8 మంది మృతి మరోవైపు, భారీ వర్షాలతో ముంబై నగరం అతలాకుతలమవుతోంది. ముంబై, థానే, రాయ్‌గఢ్ జిల్లాలకు ఐఎండీ 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. అత్యంత భారీ వర్షాలు, గంటకు 60-70 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని హెచ్చరించింది. బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కూడా హెచ్చరికలు జారీ చేసింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రైలు సేవలకు అంతరాయం ఏర్పడింది. కాగా, ముంబైలో గత రెండు రోజులుగా వర్ష సంబంధిత ఘటనల్లో మొత్తం 8 మంది ప్రాణాలు కోల్పోయారు. చెట్లు కూలిన ఘటనల్లో ఇద్దరు, ఆదివారం మన్‌ఖుర్ద్ ప్రాంతంలో ఒక భవనం కూలిపోవడంతో ఆరుగురు మృతి చెందిన విషయం తెలిసిందే.

వార్త సంధ్య
vaartha sandhya
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
RNI TGTEL/25/A5065



## రాజపురంలో సీతారామ ప్రాజెక్టు సబ్ కెనాల్ సర్వే.. రైతుల్లో ఆశలు

**సబ్ కెనాల్ నిర్మాణానికి అడుగులు వేస్తున్న ప్రభుత్వం**

**సాగునీటి ఆశలతో రైతులు.. సర్వే పనులు ప్రారంభం**

**సీతారామ ప్రాజెక్టు సర్వేతో రాజపురంలో కదలిక**



**చంద్రుగొండ ప్రతినిధి జూలై: 6 (వార్త సంధ్య) :** చంద్రుగొండ నర్సాపురం రెవెన్యూ పరిధిలోని రాజపురం గ్రామంలో సీతారామ ప్రాజెక్టు సబ్ కెనాల్ నిర్మాణానికి సంబంధించి సోమవారం అధికారులు భూ సర్వే నిర్వహించారు. సర్వే బృందం ప్రతిపాదిత కాలువ మార్గాన్ని పరిశీలించి, భూ ముల వివరాలు, హద్దులు నమోదు చేసింది. భూసేకరణ ప్రక్రియలో భాగంగా రైతులకు అవసర మైన సమా చారం అందిస్తూ అధికారులు స్థానికులతో మాట్లాడారు. సర్వే పూర్తయిన అనంతరం నివేది కను ఉన్న తాధికారులకు సమర్పించనున్నట్లు సమాచారం. ఈ సబ్ కెనాల్ నిర్మాణం పూర్తయితే పరిసర ప్రాం తాల్లో సాగునీటి సౌకర్యం మెరుగుపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సీతారామ ప్రాజెక్టు కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, భూసేకరణ సర్వే పనులు కొన సాగుతున్నాయి

## సర్ఫస్ జనరల్ అసిస్టెంట్స్ వెబ్ కౌన్సిలింగ్ తాత్కాలికంగా నిలిపివేత





**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 06 (వార్త సంధ్య) :** కొత్తగూడెం ఏరియాలో సర్ఫస్ జనరల్ అసిస్టెంట్స్ వెబ్ కౌన్సిలింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తూ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం ఎఐటియుసి పోరాట ఫలితమేనని ఆ సంఘం నాయకులు తెలిపారు. ఈ నెల 8వ తేదీన నిర్వహించాల్సిన వెబ్ కౌన్సిలింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు యాజమాన్యం గుర్తింపు సంఘమైన ఎఐటియుసికి సమాచారం అందించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ మాట్లాడుతూ, కొత్తగూడెం ఏరియాలో భూగర్భ గనుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులతోనే ముందుగా సర్ఫస్ కన్వర్షన్ ప్రక్రియ పూర్తి చేసి, అనంతరం ఖాళీగా ఉన్న సర్ఫస్ జనరల్ అసిస్టెంట్స్ పోస్టులను భర్తీ చేయాలని ఎఐటియుసి యాజమాన్యంపై నిరంతరం ఒత్తిడి తీసుకొచ్చిందన్నారు. ఈ సమస్యను ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి, భూగర్భ గని కార్మికులకు ఎలాంటి అన్యాయం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఎఐటియుసి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న యాజమాన్యం వెబ్ కౌన్సిలింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసిందని పేర్కొన్నారు. అండర్‌గ్రౌండ్ కార్మికుల సర్ఫస్ కన్వర్షన్ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, మణుగూరు సర్ఫస్ జనరల్ అసిస్టెంట్స్ అంశానికి సంబంధం లేకుండా ముఖ్యంగా పివికే-5 భూగర్భ గనిలో విధులు నిర్వహిస్తున్న అర్హులైన కార్మికులకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఎఐటియుసి డిమాండ్ చేసింది. అదేవిధంగా, సర్ఫస్ కన్వర్షన్ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన భూగర్భ గని కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి వి. మల్లికార్జున్ రావు, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, సహాయ కార్యదర్శి గట్టయ్య, ఆఫీస్ బేరర్ హుమాయూన్, నాయకులు లక్ష్మీనారాయణ, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్పు , ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ శుభాకాంక్షలు చెప్పిన టిపిసిసి కార్యదర్శి హుస్సేన్



**హైదరాబాద్, సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 6 :** నాంపల్లి అసెంబ్లీ కౌన్సిల్ ఛాంబర్ లో అద్దంకి దయాకర్ ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ ని కలిసి మర్యాద పూర్వకంగా పూల బోకే ఇచ్చి శాలువా కప్పి మరి శు భాకాంక్షలు తెలియజేయడం జరిగింది సయ్యద్ ఫసి హుసేన్ రాష్ట్ర కార్యదర్శి టిపిసిసి

## సిపి(యం) రాష్ట్ర నాయకులతో బిఆర్ఎస్ నేత వేముల హరీష్ భేటీ.. ప్రజా సమస్యలపై సమన్వయ పోరాటంపై చర్చ

**అశ్వారావుపేటలో సాగునీరు, భూమి సమస్యలు, ప్రాజెక్టుల జాప్యంపై ఉమ్మడి కార్యాచరణకు సంకేతాలు**



**చంద్రుగొండ ప్రతినిధి జూలై: 6(వార్త సంధ్య) :** అశ్వారావుపేట నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై సమన్వయంతో పోరాటం చేసే అవకాశాలపై దీ=హా నాయకుడు వేముల హరీష్ సిపి(యం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవునూరి మధుతో పాటు ఇతర రాష్ట్ర నాయకులతో సమావేశమై చర్చించారు. ఈ సమావేశంలో ముల్కలపల్లి మండలంలోని సీతారామ పంపు హౌస్ ఉన్నప్పటికీ సాగునీటి పంపిణీలో జరుగుతున్న అన్యాయం, అశ్వారావుపేట మండలంలోని పెద్దవాగు ప్రాజెక్టు నిర్లక్ష్యం, చంద్రుగొండ మండలంలోని వెంగళరావు సాగర్ మరమ్మతుల్లో జాప్యం, భూమి సమస్యలు తదితర అంశాలపై అధికార ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటంపై చర్చించినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సిపి(యం) సాధించిన ఫలితాలపై హరీష్ శుభాకాంక్షలు తెలియజేశారు. పలు అంశాల్లో ఇరు పార్టీల మధ్య ఏకాభిప్రాయం వ్యక్తమైనప్పటికీ, మరికొన్ని అంశాలపై క్షేత్రస్థాయిలో చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని అభిప్రాయపడినట్లు వెల్లడించారు. అలాగే, మావోయిస్టు నాయకుల ప్రస్తావనతో కూడిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అశ్వారావుపేటలో సమన్వయంతో పనిచేయడం వల్ల ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు భవిష్యత్ ఎన్నికల్లోనూ ప్రయోజనం ఉంటుందని వేముల హరీష్ వివరించినట్లు దీ=హా వర్గాలు తెలిపాయి.

## చంద్రుగొండలో ఘనంగా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలు




**చంద్రుగొండ ప్రతినిధి, జూలై 6:(వార్త సంధ్య) :** చంద్రుగొండ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. దేశ సమైక్యత, జాతీయత కోసం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నల్లమోతు రఘుపతిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బోగి కృష్ణ, మండల ఉపాధ్యక్షుడు కుక్కడపు రామారావు, బీజేపీ వార్డు సభ్యుడు తేజావత్ బాబు, బీజేవైఎం అధ్యక్షుడు మరకాల రవీందర్ రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు పెద్దిన్ని సతీష్, యువ మోర్చా అధ్యక్షుడు జంగా సత్యనారాయణ రెడ్డి, వీరపనేని సతీష్, రాయల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సేవల్లో దళారుల రాజ్యం..!

**ప్రజల జేబులు గుల్ల చేస్తున్న సర్టిఫికెట్ దళారులు..!**

**కుల, ఆదాయ ధృవపత్రాలకు అక్రమ వసూళ్లు..!**

**కుల, ఆదాయ సర్టిఫికెట్ల పేరుతో దళారుల దోపిడీ**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 06 (వార్త సంధ్య) :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలన్నా, విద్యా సంస్థల్లో ప్రవేశాలు తీసుకోవాలన్నా, ఉద్యోగాలకు దరఖాస్తు చేయాలన్నా, స్కాలర్‌షిప్‌లు పొందాలన్నా, వివిధ ప్రభుత్వ సేవలు పొందాలన్నా కుల ధృవీకరణ పత్రం (కాస్ట్ సర్టిఫికెట్), ఆదాయ ధృవీకరణ పత్రం (ఇన్‌కమ్ సర్టిఫికెట్), నివాస ధృవీకరణ పత్రం (రెసిడెన్సీ సర్టిఫికెట్) తప్పనిసరిగా అవసరం అవుతున్నాయి. ఈ అవసరాన్ని కొందరు దళారులు ఆదాయ వనరుగా మార్చుకుని ప్రజల జేబులు గుల్ల చేస్తున్నారనే ఆరోపణలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించేందుకు మీ సేవ కేంద్రాలు, ఆన్‌లైన్ దరఖాస్తు విధానం, రెవెన్యూ కార్యాలయాల ద్వారా నిర్దిష్ట విధానాన్ని అమలు చేస్తున్నప్పటికీ, కొందరు మధ్యవర్తులు మాత్రం "మా ద్వారా చేస్తే త్వరగా వస్తుంది", "అధికారులతో పరిచయం ఉంది", "ఫైల్ వెంటనే ముందుకు కదులుతుంది" అంటూ అమాయక ప్రజలను నమ్మించి ఒక్కో సర్టిఫికెట్‌కు రూ. 1,000 వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులు, నిరుద్యోగ యువత, రైతులు, కార్మికులు, వృద్ధులు, మహిళలు వంటి సాధారణ ప్రజలే ఈ దళారుల ప్రధాన లక్ష్యంగా మారుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందని భయపెట్టి, తామే అన్ని పనులు పూర్తి చేస్తామని చెప్పి భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. చాలామంది ప్రజలకు అసలు ప్రభుత్వ రుసుము ఎంత, దరఖాస్తు విధానం ఏమిటి అనే విషయాలపై పూర్తి అవగాహన లేకపోవడంతో ఈ దళారుల మాటలను నమ్మి డబ్బులు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా విద్యార్థులకు కళాశాలల్లో ప్రవేశాల సమయంలో, స్కాలర్‌షిప్ దరఖాస్తుల సమయంలో, ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్లు వెలువడినప్పుడు, ప్రభుత్వ పథకాల అమలు సమయంలో సర్టిఫికెట్లకు డిమాండ్ పెరుగుతుంది. ఇదే సమయాన్ని అవకాశంగా మార్చుకుని కొందరు దళారులు ప్రజల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు మరింత బలంగా వినిపిస్తున్నాయి. కొంతమంది మధ్యవర్తులు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులు సేకరించడం, అవసరమైన పత్రాలు తీసుకోవడం, డబ్బులు ముందుగానే వసూలు చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు కూడా స్థానికులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో అసలు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుము కంటే అనేక రెట్లు ఎక్కువ మొత్తాన్ని వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. డబ్బులు తీసుకున్న తర్వాత ఆలస్యం చేయడం, ఫోన్‌లు ఎత్తకపోవడం, బాధితులను కార్యాలయాల చుట్టూ తిప్పించడం వంటి సంఘటనలు కూడా జరుగుతున్నాయని సమాచారం. ప్రభుత్వం ఇప్పటికే ప్రజలకు డిజిటల్ సేవలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. మీ సేవ కేంద్రాల ద్వారా నిర్ణీత విధానంలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అయినప్పటికీ కొందరు దళారులు ప్రజల్లో ఉన్న అవగాహన లోపాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజలకు అవసరమైన సేవలు పారదర్శకంగా, వేగంగా అందిం చాల్సిన బాధ్యత సంబంధిత శాఖలపై ఉంది. అయితే కార్యాలయాల వద్ద దళారుల సంచారం పెరగడం, ప్రజలతో నేరుగా వ్యవహరించడం వంటి అంశాలపై అధికారులు మరింత నిఘా పెట్టాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ కార్యాల యాల పరిసరాల్లో మధ్యవర్తుల కార్యకలాపాలను పూర్తిగా అరికట్టాలని, అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అదే సమయంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సామాజికవేత్తలు సూచిస్తున్నారు. ప్రభుత్వ సేవల కోసం ఎవరైనా అదనపు డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని, అధికారిక మార్గాల ద్వారానే దరఖాస్తులు చేసుకోవాలని సూచిస్తున్నారు. మధ్యవర్తుల మాటలు నమ్మి డబ్బులు చెల్లించే ముందు పూర్తి వివరాలు తెలుసుకోవాలని హెచ్చరిస్తున్నారు. రెవెన్యూ శాఖ అధికారులు కూడా గ్రామాలు, వార్డులు, కాలనీల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సర్టిఫికెట్లు పొందే అధికారిక విధానం, చెల్లించాల్సిన రుసుములు, అవసరమైన పత్రాల గురించి ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. దీంతో దళారుల మోసాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది. అయితే ప్రస్తుతం కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో వినిపిస్తున్న ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ వసూళ్లు జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వ సేవలను ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రజలకు అందించేలా కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఎఐటియుసి పోరాట ఫలితం...

**సర్ఫస్ జనరల్ అసిస్టెంట్స్ వెబ్ కౌన్సిలింగ్ తాత్కాలికంగా నిలిపివేత**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 06 (వార్త సంధ్య) :** కొత్తగూడెం ఏరియాలో సర్ఫస్ జనరల్ అసిస్టెంట్స్ వెబ్ కౌన్సిలింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తూ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం ఎఐటియుసి పోరాట ఫలితమేనని ఆ సంఘం నాయకులు తెలిపారు. ఈ నెల 8వ తేదీన నిర్వహించాల్సిన వెబ్ కౌన్సిలింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు యాజమాన్యం గుర్తింపు సంఘమైన ఎఐటియుసికి సమాచారం అందించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ మాట్లాడుతూ, కొత్తగూడెం ఏరియాలో భూగర్భ గనుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులతోనే ముందుగా సర్ఫస్ కన్వర్షన్ ప్రక్రియ పూర్తి చేసి, అనంతరం ఖాళీగా ఉన్న సర్ఫస్ జనరల్ అసిస్టెంట్స్ పోస్టులను భర్తీ చేయాలని ఎఐటియుసి యాజమాన్యంపై నిరంతరం ఒత్తిడి తీసుకొచ్చిందన్నారు. ఈ సమస్యను ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి, భూగర్భ గని కార్మికులకు ఎలాంటి అన్యాయం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఎఐటియుసి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న యాజమాన్యం వెబ్ కౌన్సిలింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసిందని పేర్కొన్నారు. అండర్‌గ్రౌండ్ కార్మికుల సర్ఫస్ కన్వర్షన్ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, మణుగూరు సర్ఫస్ జనరల్ అసిస్టెంట్స్ అంశానికి సంబంధం లేకుండా ముఖ్యంగా పివికే-5 భూగర్భ గనిలో విధులు నిర్వహిస్తున్న అర్హులైన కార్మికులకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఎఐటియుసి డిమాండ్ చేసింది. అదేవిధంగా, సర్ఫస్ కన్వర్షన్ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన భూగర్భ గని కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి వి. మల్లికార్జున్ రావు, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, సహాయ కార్యదర్శి గట్టయ్య, ఆఫీస్ బేరర్ హుమాయూన్, నాయకులు లక్ష్మీనారాయణ, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ అసెంబ్లీకి రావాలి- కాళేశ్వరంపై వివరణ ఇవ్వాలి

**కేసీఆర్ తేదీ చెబితే ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించేందుకు సిద్ధం**

**కాళేశ్వరం అవినీతి, ఇందిరమ్మ ఇళ్లపై ప్రజల ముందే చర్చిద్దాం**

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూలై 6 :** దేశంలోనే "ఎనిమిదో వింత"గా కాళేశ్వరం ప్రాజెక్టును ప్రచారం చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడు అసెంబ్లీకి వచ్చి కాళేశ్వరం ఎందుకు కుంగిపోయిందో, వేల కోట్ల ప్రజాధనం ఎలా వృథా అయిందో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. కేసీఆర్ తేదీ, సమయం సూచిస్తే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా ములుగు మండలంలో సహచర మంత్రి వివేక్ వెంకటస్వామి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టింది మీరే... కూలింది మీ హయాంలోనే .. ఇప్పుడు మళ్లీ అక్కడికి వెళ్లి గొప్పలు చెప్పుకోవడం కూడా మీరే. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వానికి సంబంధమేంటి?" అని ప్రశ్నించారు. ప్రతి పేదవాడి చెమటోడ్చి చెల్లించిన పన్నుల డబ్బుతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యత లేక కుంగిపోతే, దానికి బాధ్యత వహించాల్సింది బీఆర్ఎస్ నాయకత్వమేనని అన్నారు. గోదావరి జలాలను కృష్ణా పరివాహక ప్రాంతాలకు తరలించే పేరుతో నిర్మించిన ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేసి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంపై ఎన్ని నిరాధార ఆరోపణలు చేసినా ప్రజలు వాటిని తిరస్కరిస్తూనే ఉన్నారని, అధికార దాహంతో చేస్తున్న రాజకీయాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతున్నారని అన్నారు. నిజంగా ప్రజాహితం కోసం సూచనలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీ వేదిక సిద్ధంగా ఉందని, అక్కడే అన్ని అంశాలపై బహిరంగంగా చర్చిద్దామని కేసీఆర్‌కు సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఇప్పటికీ 32 వేల కుటుంబాలు పూరిగుడిసెల్లో జీవిస్తున్నాయని ప్రభుత్వం గుర్తించిందని, రెండో విడత నుంచి నాలుగో విడత వరకు వారికి అత్యంత ప్రాధాన్యంతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్దిపేటతో పాటు కొద్ది ప్రాంతాల్లో మాత్రమే ఇళ్లు నిర్మించి, మిగిలిన నియోజకవర్గాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. నిర్మించిన ఇళ్లను కూడా అసంపూర్తిగా వదిలేసిందని అన్నారు. గత పదేళ్లలో ప్రతి ఏడాది లక్ష ఇళ్లు నిర్మించి ఉంటే నేడు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ప్రస్తుతం మెదక్, హైదరాబాద్ సహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేస్తున్నామని, మహిళల సాధికారతకు ప్రాధాన్యమిస్తూ ఆడబిడ్డల పేరుతో ఇళ్ల పట్టాలు అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో తొలి విడత ఇందిరమ్మ ఇళ్లలో ఇప్పటికే లక్షా 30 వేల ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని, మరో 70 నుంచి 75 వేల ఇళ్లు శ్లాబ్ దశకు చేరుకున్నాయని తెలిపారు. కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. మొదటి విడత విజయవంతం కావడంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టారని, ఈ విడతలో రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని, ప్రతి నియోజకవర్గంలో రెండు వేల ఇళ్లు నిర్మించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వివరించారు. ఇందులో 1,500 కొత్త ఇళ్లతో పాటు గతంలో అసంపూర్తిగా మిగిలిపోయిన 500 రేకుల ఇళ్లు, మొండిగోడల ఇళ్ల పూర్తి కోసం కూడా నిధులు విడుదల చేస్తున్నామని మంత్రి తెలిపారు.

## ఎంసీ ఆర్ హెచ్ ఆర్ డి బోధి పెవిలియన్ లో పర్యాటక శాఖ పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష.



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూలై 6. :** హాజరైన సీఎం సలహాదారు రామకృష్ణా రావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్,సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి,సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ ,టూరిజం సెక్రటరీ వాణి ప్రసాద్,టూరిజం కార్పొరేషన్ ఎండీ గౌతమి తారామతి బారామతి ని టూరిజం ప్లేస్ గా మరింత గా అభివృద్ధి చేయాలి.. దుర్గం చెరువు ను పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి.. మంజీరా,దిల్ కుషా గెస్ట్ హౌస్ లను ఆధునీకరించాలి.. టూరిజం హబ్ డెవలప్మెంట్ పథకం కింద వికారాబాద్ ను అభివృద్ధి చేయాలి.. వికారాబాద్ లో వీరభద్రస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయాలి.. యాదాద్రి తరహా లో టెంపుల్ కి కమిటీ ఏర్పాటు చేయాలి .. క్యూర్ పరిధి లో ఉన్న అటవీ శాఖ భూములను పర్యాటక శాఖ తో కలిసి ఎకో టూరిజం గా అభివృద్ధి చేయాలి.. గుర్రంగూడ ఎకో పార్క్ తరహా లో నగరం లో ఎకో పార్క్ లు తీర్చి దిద్దాలి.. ఫ్యూచర్ సిటీ లో ఉన్న అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో తీర్చి దిద్దాలి.. అర్బన్ ఫారెస్ట్ తరహా లో ఏర్పాట్లు చేయాలి.. అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్ట్ ల కోసం స్పెషల్ ఆఫీసర్ ను ఏర్పాటు చేసుకొని పనులను ముమ్మరం చేయాలి.. పురానాపూల్ హెరిటేజ్ బ్రిడ్జి లను అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి.. బ్రిడ్జిలపైన పర్యాటకుల కోసం ఏర్పాట్లు చేయాలి.. అవకాశం ఉంటే ట్రాఫిక్ మళ్లించి పర్యాటకులకు అవకాశం కల్పించాలి.. డిసెంబరు లో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్ పైన కసరత్తు ప్రారంభించాలి.. సమ్మిట్ కోసం డిపార్ట్మెంట్ ల మధ్య సమన్వయం కోసం కమిటీ లు ఏర్పాటు చేయాలి..

## ప్రజావాణిలో దరఖాస్తుల వెల్లువ



**మంథని జులై 06( వార్త సంధ్య ):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరిస్తూ నిష్పక్షపాతంగా పరిశీలిస్తున్నట్లు మంథని రెవెన్యూ డివిజనల్ అధికారి సురేష్ తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సమస్యల పరిష్కారానికి కేంద్ర బిందువుగా నిలిచిందని దరఖాస్తుదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం చేపట్టిన సాదా బైనమా లపై పట్టాదారుల ఫోర్జరీ సంతకాలతో దరఖాస్తులు సమర్పిస్తున్న విషయమై కచ్చితంగా పరిశీలించి పట్టాదారులకు న్యాయం చేయాలని కోరుతూ ప్రజావాణిలో సమర్పిస్తున్న దరఖాస్తులపై న్యాయం చేయాలని కోరుతున్నారు. మంథని మండలం బిట్టుపల్లి, జిల్లాల పల్లి గ్రామ శివారులో గల సర్వే నెంబర్ 56లోని 3 ఎకరాల 3 గుంటల భూమిపై ఫోర్జరీ సంతకాలతో సాదా బైనామ సమర్పించిన దరఖాస్తులను నిలిపివేయాలని కోరుతూ ఆధారాలతో సహా మహావాది సరోజినీ దేవి కుమారుడు సతీష్ కుమార్ ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు. అలాగే బిట్టుపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 68/1లోని 5 ఎకరాల 17 గుంటలు, 68/2లోని 4 గుంటల భూమి విషయంలో కూడా అన్ని రకాల ఆధారాలు సమర్పించినట్లు సతీష్ కుమార్ తెలిపారు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



# కాలనీలు, మురికివాడల్లో తాగునీటి సరఫరాను మెరుగుపరచాలి బండి రమేష్



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కాలనీలతో పాటు మురికివాడల్లో సైతం తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బండి రమేష్ అధికారులను కోరారు. సోమవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి కేపీహెచ్‌బీ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) హర శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలపై చర్చించారు. వాటర్ వర్క్స్ పరిధిలోకి వచ్చే సఫ్దర్ నగర్, దీన్ దయాళ్ నగర్, మోతీ నగర్, 15వ ఫేస్ లలో కొత్తగా డ్రైనేజీ లైన్ల నిర్మాణం చేపట్టాలని, అలాగే మోతీ నగర్‌లో వాటర్ సంపు నిర్మించాలని జీఎంకు సూచించారు. వీటితో పాటు మురికివాడల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ 20 వేల లీటర్ల ఉచిత తాగునీటి పథకాన్ని పక్కాగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎంలు త్రినాథరావు, చంద్రశేఖర్, లక్ష్మయ్యలతో పాటు స్థానిక నాయకులు తూము వేణు, సతీష్ రెడ్డి, కృష్ణ రాజ్‌పుత్, రాజేష్, మైఖేల్, ఫణి కుమార్, రజిత, వనజ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## 25 వేల పెన్షన్ ఉద్యమకారులకు ఇవ్వాలి: డాక్టర్ పిడమర్తి రవి



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 6.** : తెలంగాణ ఉద్యమ కారులకు 25 వేల రూపాయల పెన్షన్ తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవ స్థాప కులు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. ఈ రోజు కేకే కమిటీ ఆధ్వ ర్యం లో అమరజ్యోతి భవన్ లో తెలం గాణ ఉద్యమకారుల సమావేశం నిర్వ హించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం మాజీ శాసనసభ్యులకు ఎంత పెన్షన్ ఇస్తుందో తెలంగాణ ఉద్యమకారులకు అంతే పెన్షన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమశీ లో విద్యార్థి ఉద్యమానికి తీరని ద్రోహం చేసి రాజకీయ జేఏసీ ఏర్పాటు చేశారని అదేవిధంగా ఉద్యమంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో తగిన విధంగా న్యాయం జరగలేదని ప్రభుత్వంలో ఉద్యమకారులకు సమచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. జార్ఖండ్, అస్సాం రాష్ట్ర ఉద్యమకారులకు ఆ రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించే వారికి గుర్తింపు గౌరవం ఇవ్వాలని అన్నారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 06 (వార్త సంధ్య) :** భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలను కొత్తగూడెంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశ సమగ్రత, జాతీయ ఐక్యత, దేశభక్తికి ప్రతీకగా నిలిచిన మహనీయుడని కొనియాడారు. ఆయన చూపిన మార్గం, సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రతి భారతీయ జనతా పార్టీ కార్యకర్త ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి నిబద్ధతతో పనిచేస్తే భారతదేశం విశ్వగురువుగా మరింత ఉన్నత స్థానానికి చేరుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని తెలిపారు. దేశ ఐక్యత, దేశ సమగ్రత, దేశభక్తి కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయడమే డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నిజమైన నివాళి అవుతుందని బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలను స్మరించుకున్నారు.

## అలరించిన వాఘె కళారూపం
## - గోండు భాషలో ఆదివాసీ జానపద వైభవం




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 6.** : భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని పాల్కురికి సోమన మూల వేదికపై ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సాంస్కృతిక మహోత్సవంలో భాగంగా, తేది 06-07-2026న జరిగిన 97వ రోజు కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా మారుతి బృందం ప్రదర్శించిన వాఘె ఆదివాసీ జానపద కళా రూపం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఆదిలాబాద్ గిరిజనుల జీవన విధానం, సంస్కృతి, సంప్రదా యాలు, ప్రకృతి ఆరాధనను ప్రతిబింబించే గోండు భాషా జానపద గీతాలు, డప్పు, డోలక్, బోండ్కా వంటి సంప్రదాయ వాద్యాల మేళవింపుతో అద్భుతంగా వినిపించాయి. రంగురంగుల సంప్ర దాయ వస్త్రధారణ, ప్రత్యేక ఆహార్యం, ఉత్సాహభరితమైన నృత్య విన్యాసాలు ప్రేక్షకులను ఆద్యంతం అలరించి, గిరిజన సంస్కృతికి అద్దం పట్టాయి. ఈ ప్రదర్శనలో డప్పుపై విఠల్ ఆజిక్, బోండ్కాపై రాందాస్, డోలక్‌పై ఖండు గైక్వాడ్ తమ అద్భుతమైన వాద్య సహకారంతో కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు నర్సింహా రెడ్డి, ఐఏఎస్, సహాయ సంచాలకులు పి. నర్సింలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. పి. విజయ్ కుమార్ కళాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు. అలాగే సాంస్కృతిక సలహా మండలి సభ్యులు శ్రీ ముచర్ల దినకర్, శ్రీ పల్లె నర్సింహులు కార్యక్రమంలో పాల్గొని కళాకారులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమానికి విద్యానందాచారి మరియు శ్రీనివాస రాజు వ్యాఖ్యాతలుగా వ్యవహరించి, గోండు ఆదివాసీ సంస్కృతి విశిష్టతను ప్రేక్షకులకు చక్కగా పరిచయం చేశారు.

# మణుగూరులో నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభం

### ముఖ్య అతిథిగా డీజీపీ సి.వి. ఆనంద్, ఎమ్మెల్యే పాయం




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 06 వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాన్ని తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన డీజీపీ, ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీసింగ్ సేవలు అందించేందుకు ఆధునిక వసతులతో ఈ భవనాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రేంజ్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్ రెడ్డి, మణుగూరు సీఐ పాటి నాగబాబు, అశ్వాపురం సీఐ చిలివేరు ఎల్లయ్య, ఏడుల్ల బయ్యారం సీఐ ఏర్పుల వెంకటేశ్వర్లు, ఎస్సైలు సురేష్, నగేష్, ఇల్లా రాజేష్, రవూఫ్, పీవీఎన్ రావు, ప్రముఖ వాస్తు సిద్ధాంతి డాక్టర్ పదిరావూరి శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఫారాల పంపిణీలో పెరుగుతున్న రాజకీయ జోక్యం..!

**బీఎల్‌ఓలు ఉండగా నేతల పెత్తనం ఎందుకు..?**

**కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రక్రియ ప్రజల కోసమా..**

**రాజకీయ నాయకుల కోసమా..?**

**ప్రజల వ్యక్తిగత వివరాల సేకరణలో రాజకీయ జోక్యంపై ఆందోళన**

**సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని ప్రజల విజ్ఞప్తి**




**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 6 (వార్త సంధ్య):** దేశంలో ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా, ప్రజలకు సులభంగా ఉండేలా చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల వ్యవస్థ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఎస్ఐఆర్ (ూ×=) ప్రక్రియ ప్రస్తుతం పలు ప్రాంతాల్లో రాజకీయ చర్చకు దారితీస్తోంది. ప్రభుత్వ అధికారులు, ముఖ్యంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) నిర్వహించాల్సిన ఈ ప్రక్రియలో రాజకీయ నాయకులు, పార్టీ కార్యకర్తలు ప్రత్యక్షంగా పాల్గొంటున్నారనే ఆరోపణలు ప్రజలలో అనేక సందేహాలకు తావిస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియ ప్రజాస్వామ్యానికి మూలస్తంభం. అందుకే ఓటర్ల జాబితా, దరఖాస్తుల పరిశీలన, నమోదు వంటి అంశాల్లో పూర్తి నిష్పక్షపాత వైఖరి అవసరం. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ ఫారాల పంపిణీ, వివరాల సేకరణ, దరఖాస్తుల పూరణ వంటి అంశాల్లో రాజకీయ నాయకులు చురుకుగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా ప్రతి పోలింగ్ బూత్‌కు ఎన్నికల శాఖ ప్రత్యేకంగా బీఎల్‌ఓలను నియమిస్తుంది. ఆయా అధికారులు ప్రజలకు ఫారాలు అందించడం, అవసరమైన వివరాలను తెలియజేయడం, ఫారాలను ఎలా పూరించాలో సూచించడం, అవసరమైతే ఇంటింటికీ వెళ్లి సహాయం చేయడం వంటి బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ మొత్తం ప్రక్రియ ప్రభుత్వ అధికారిక పర్యవేక్షణలో జరుగుతుంది. అలాంటి పరిస్థితిలో రాజకీయ నాయకులు, పార్టీ కార్యకర్తలు అదే పనిని చేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న తలెత్తుతోంది. కొన్ని ప్రాంతాల్లో పార్టీ నాయకులు ప్రజల ఇళ్లకు వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలు అందించడం, వాటిని నింపించడం, అవసరమైన ధ్రువపత్రాలను సేకరించడం, ఫారాలను ఒకేచోట సమీకరించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వ అధికారిని సంప్రదించాలా? లేక రాజకీయ నాయకుడిని సంప్రదించాలా? అనే సందేహం నెలకొంటోంది. ఎస్ఐఆర్ ఫారాల్లో వ్యక్తిగత సమాచారం నమోదు చేయాల్సి ఉంటుంది. పేరు, చిరునామా, కుటుంబ వివరాలు, ఇతర గుర్తింపు సమాచారం వంటి అంశాలు ఉండే అవకాశం ఉంటుంది. అలాంటి వివరాలను రాజకీయ నాయకులు లేదా పార్టీ కార్యకర్తలు సేకరించడం గోప్యతకు భంగం కలిగించే అంశమని కొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రజల వ్యక్తిగత సమాచారం ప్రభుత్వ అధికారుల వద్ద మాత్రమే ఉండాలని, రాజకీయ వ్యవస్థ చేతుల్లోకి వెళ్లకూడదని పలువురు సూచిస్తున్నారు. అభ్యర్థులు స్వయంగా పూర్తి చేయాల్సిన ఫారాలను ఇతరులు నింపడం వల్ల తప్పులు జరిగితే దానికి బాధ్యత ఎవరిది? అనే ప్రశ్న కూడా ఎదురవుతోంది. ఒకవేళ తప్పుడు సమాచారం నమోదైతే దాని ప్రభావం భవిష్యత్తులో ఓటరు హక్కులపై పడే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. అందుకే ప్రతి దరఖాస్తుదారు తన ఫారాన్ని స్వయంగా పరిశీలించి, తన సమక్షంలోనే పూర్తి చేయాల్సిన అవసరం ఉందని వారు చెబుతున్నారు. రాజకీయ నాయకులు ప్రజలకు అవగాహన కల్పించడం ఒక విషయం. కానీ ప్రభుత్వ అధికారుల విధులను ప్రత్యక్షంగా నిర్వహించడం మరో విషయం. ఈ రెండింటి మధ్య స్పష్టమైన తేడా ఉండాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు సమాచారం ఇవ్వడం వరకు రాజకీయ నాయకుల పాత్ర ఉండవచ్చు. కానీ అధికారిక ప్రక్రియలో భాగమై ఫారాలు నింపించడం, వివరాలు సేకరించడం, దరఖాస్తులు సమర్పించడం వంటి పనులు ప్రభుత్వ యంత్రాంగం ద్వారానే జరగాలని వారు సూచిస్తున్నారు. ప్రస్తుతం గ్రామాలు, పట్టణాల్లో కొన్ని చోట్ల బీఎల్‌ఓల కంటే రాజకీయ నాయకులే ఎక్కువగా కనిపిస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన బీఎల్‌ఓలు ఎక్కడ ఉన్నారు? వారు తమ విధులు నిర్వర్తిస్తున్నారా? లేదా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా పక్కకు తప్పుకున్నారా? అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు సమగ్రంగా సమీక్ష నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం అత్యంత కీలకం. ఆ నమ్మకాన్ని దెబ్బతీసే విధంగా ఏ చర్య జరిగినా భవిష్యత్తులో అనవసర వివాదాలకు కారణమవుతుంది. అందుకే ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని ప్రజలు సూచిస్తున్నారు. అధికారిక బాధ్యతలు అధికారులే నిర్వహిస్తేనే పారదర్శకత, నిష్పక్షపాతత్వం కొనసాగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

**ప్రజల్లో ప్రస్తుతం వినిపిస్తున్న ప్రధాన ప్రశ్నలు ఇవే...**

**"బీఎల్‌ఓలు ఉన్నప్పుడు రాజకీయ నాయకులు ఎందుకు ఫారాలు పంచుతున్నారు?"**

**"కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రక్రియలో రాజకీయ జోక్యం ఎందుకు పెరుగుతోంది?"**

**"ప్రజల వ్యక్తిగత వివరాలను రాజకీయ నాయకులు సేకరించడం సరైన విధానమేనా?"**

**"ప్రభుత్వ అధికారులు ఉన్నప్పుడు వారి బాధ్యతలను ఇతరులు ఎందుకు నిర్వర్తిస్తున్నారు?"**

ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. అవసరమైతే జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా ఉండాల్సిన ఎన్నికల సంబంధిత కార్యక్రమాల్లో ఏ పార్టీకి చెందిన నాయకులైనా ప్రత్యక్షంగా పాల్గొనకుండా తగిన మార్గదర్శకాలు జారీ చేయాలని, బీఎల్‌ఓల ద్వారానే మొత్తం ప్రక్రియను నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజలకు అవసరమైన సమాచారం అధికారికంగా అందుబాటులో ఉండేలా ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కూడా సూచిస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసమే అత్యంత విలువైనది. ఆ విశ్వాసాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ఎన్నికల నిర్వహణలో భాగమైన ప్రతి అధికారిపై ఉంది. అందువల్ల ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తిగా నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా, రాజకీయ ప్రభావాలకు అతీతంగా అమలయ్యేలా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ సర్క్యులర్ వెంటనే జారీ చేయాలి




**మునుగోడు:జూలై -6 (వార్త సంధ్య) :** జర్నలిస్టుల కుటుంబాల పిల్లలకు ప్రభుత్వం ప్రకటించిన ఫీజు రాయితీ అమలుకు సంబంధించిన సర్క్యులర్‌ను తక్షణమే జారీ చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే-ఐజేయు) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ పిలుపు మేరకు సోమవారం మునుగోడు మండల కేంద్రంలోని మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల విద్యాధికారి తలమల్ల మల్లేశంకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయు) నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ముడుపు శ్యాంసుందర్ రెడ్డి, జిల్లా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు కుంభం ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలని గత నెల 5వ తేదీన జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా విద్యాశాఖాధికారికి వినతిపత్రాలు అందజేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర నిరాశకు గురి చేస్తోంద న్నారు.రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం పలు నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ, వాటి అమలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.పాఠశాలలు ప్రారంభమై ఇప్పటికే నెల రోజులు గడిచినా ఫీజు రాయితీపై స్పష్టమైన ఉత్తర్వులు వెలువడకపోవడంతో పేద, మధ్యతరగతి జర్నలిస్టుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ సర్క్యులర్లు అమల్లోకి వచ్చాయని, అదే విధంగా నల్గొండ జిల్లాలో కూడా వెంటనే సర్క్యులర్ జారీ చేసి ప్రభుత్వ హామీని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.సమాజానికి నిత్యం సేవలందించే జర్నలిస్టుల కుటుంబాల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఆలస్యం చేయకుండా విద్యార్థులకు ఫీజు రాయితీ అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి సర్క్యులర్ విడుదల చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జాజుల స్వామి, సహాయ కార్యదర్శి దొమ్మాటి కృష్ణ, మార్నేని ప్రభాకర్, నెల్లికంటి శంకర్, బేరీ లింగస్వామి, పెరుమాళ్ల ప్రమోద్ కుమార్, దుబ్బ విజయభాస్కర్, జీడిమడ్ల నరేష్, దుబ్బ అనిల్, విజయ్ కుమార్ పాటు పలువురు జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ప్రతి రూపాయి లెక్క తేల్చుదాం.. గ్రామాభివృద్ధిలో భాగస్వాములమవుదాం

**మన ఊరు - మన ఉపాధి ఐదో విడత సామాజిక తనిఖీ**

**గ్రామ స్వరాజ్యం దిశగా.. పక్కాగా సామాజిక తనిఖీ**

**ఉపాధి హామీలో తనిఖీ కలకలం.. రూ. 11,855 రికవరీకి ఆదేశం**

**అన్నపురెడ్డిపల్లిలో సామాజిక తనిఖీ సమావేశంలో అధికారుల ఆగ్రహం**

**రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యంపై ఏపీడీ సీరియస్**




**చంద్రుగొండ ప్రతినిధి జూలై 6: (వార్త సంధ్య) :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత లోపించడం, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంపై అధికారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ఐదో విడత సామాజిక తనిఖీ సమావేశంలో పథకం అమలులో జరిగిన లోపాలను ఏపీడీ విజయభాస్కర్‌రెడ్డి ఎండగట్టారు.

**నిబంధనలకు పాతర.. నిర్లక్ష్యానికి కేరాఫ్**

క్షేత్రస్థాయిలో పనులు జరుగుతున్నా, అందుకు సంబంధించిన నిబంధనలను ఎవరూ పాటించడం లేదని తనిఖీల్లో వెల్లడైంది. నోట్ క్యామ్ ఫోటోల గైర్హాజరు పనులు ప్రారంభానికి ముందు, పూర్తయిన తర్వాత 'నోట్ క్యామ్' యాప్ ద్వారా ఫోటోలను అప్‌లోడ్ చేయకపోవడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు పేర్కొన్నారు. అస్తవ్యస్తంగా రికార్డులు నర్సరీ మొక్కల నిర్వహణ రిజిస్టర్లు, జాబ్ కార్డుల అప్‌డేషన్ సరిగ్గా లేకపోవడం వల్ల కూలీల పేమెంట్లు నిలిచిపోతున్నాయని స్పష్టం చేశారు. బోర్డుల జాడేది పని జరిగిన ప్రాంతంలో నేమ్ బోర్డులు లేకపోవడం, నోటీస్ బోర్డుల్లో వివరాలు ప్రదర్శించకపోవడంపై ఏపీడీ ప్రశ్నించారు.

**ప్రశ్నల వర్షం.. రికవరీకి ఆదేశం**

ఒకే కుటుంబానికి 100 రోజుల పని దినాలకు మించి ఎలా కల్పించారని, ఆ పేమెంట్లు ఎలా జరిగాయని అధికారులను నిలదీశారు. అలాగే, మొక్కల పెంపకం విషయంలో రైతులు నరికివేస్తే గ్రామసభ తీర్మానాలు తీసుకోవాలని, చనిపోయిన మొక్కల స్థానంలో వెంటనే కొత్తవి నాటాలని ఆదేశించారు. మండలంలోని పది పంచాయతీల్లో జరిగిన సామాజిక తనిఖీల్లో రూ.4,855 దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. దీనికి రూ.7,000 జరిమానాను కలిపి, మొత్తం రూ.11,855 రికవరీ చేయాలని నిర్ణయించారు.

**పాల్గొన్న అధికారులు..**

ఈ కార్యక్రమంలో ఏపీడీలు విజయభాస్కర్‌రెడ్డి, వెంకటరమణారావు, క్వాలిటీ కంట్రోలర్ అవినాష్, ఏఎం అనూష, ఎంపీడీవో రాజేశ్వరి, ఏపీవో ప్రమీల, ఎస్ఆర్పీ రాజు, ఎస్టీఎం అజయ్, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, సర్పంచులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అర్ధరాత్రి పంట ధ్వంసం దారుణమని ఖండన.. ఘటనపై సమగ్ర విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని అధికారులకు డిమాండ్.

**నల్లకుంటలో కొబ్బరి మొక్కల ధ్వంసం.. బాధిత రైతులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా**



**చంద్రుగొండ ప్రతినిధి జూలై: 6(వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నల్లకుంట గ్రామంలో కొబ్బరి మొక్కలు ధ్వంసం చేయబడిన ఘటన రాజకీయంగా చర్చనీయాంశమైంది.




బాధిత రైతులను మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పరామర్శించి, ధ్వంసమైన కొబ్బరి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ వివాదాలు ఉంటే చట్టపరంగా పరిష్కరించుకోవాలని, అర్ధరాత్రి సమయంలో రైతుల పంటలను ధ్వంసం చేయడం దుర్మార్గ మైన చర్య అని అన్నారు. బడుగు, బలహీన, గిరిజన రైతులపై అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, రికార్డుల ప్రకారం అసలైన రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులను ఎవరైనా వేధిస్తే సహించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు బాధిత రైతులు పాల్గొన్నారు.

# ఏడాదిగా నిలిచిన సెంటర్ లైటింగ్ పనులు

**గుంతలు, దుమ్ము, డ్రైనేజీ సమస్యలతో ప్రజల ఇబ్బందులు**

**బిల్లులు చెల్లించక కాంట్రాక్టర్లు పనులు నిలిపివేత**

**అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం**




**చంద్రుగొండ ప్రతినిధి జూలై 6: (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో చేపట్టిన సెంటర్ లైటింగ్ పనులు ఏడాదిగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసంపూర్తిగా వదిలేసిన గుంతలు, డ్రైనేజీ లేక వర్షపు నీరు ఇళ్లలోకి చేరడం, రోడ్డుపై





కంకర రాళ్లతో ప్రమాదాలు, రాత్రివేళల్లో వెలుతురు లేక వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నుంచి బిల్లులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారని సమాచారం. రోడ్డు పక్కన దుమ్ము, ధూళి కారణంగా వ్యాపారులు, స్థానికులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# జీహెచ్ఎంసీ స్థానంలో క్యూర్-2026 చట్టం

**వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లు!**

**ముసాయిదా బిల్లుపై అభిప్రాయాలు, సూచనలకు ఆహ్వానం**

**క్యూర్ పరిధి మొత్తానికి భూ విలువ ఆధారిత ఆస్తిపన్ను**

**ఏడు దశాబ్దాల తర్వాత జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో క్యూర్ చట్టం**




జీహెచ్ఎంసీ (గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్) స్థానంలో క్యూర్-2026 చట్టం రానుంది. ఈ చట్టానికి సంబంధించిన డ్రాఫ్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. ముసాయిదాపై ప్రజలు, నిపుణుల నుంచి ఈనెల 24 వరకు అభిప్రాయాలు, సూచనలు తీసుకోనున్నట్లు తెలిపింది. అందుకోసం జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌లో డ్రాఫ్ట్ బిల్లు కాపీని అందుబాటులో ఉంచింది. బిల్లు ప్రతిని తెరవగానే వెబ్‌పేజీ కింద ప్రొసీడ్ టు ఫీడ్‌బ్యాక్ అనే వెబ్‌లింక్ ఉంటుంది. దాన్ని నొక్కితే సూచనలు, అభిప్రాయాలను తెలిపే అప్లికేషన్ వస్తుంది. అందులో పౌరులు ఎవరైనా తమ అభిప్రాయాలను పొందుపరిచి ప్రభుత్వానికి పంపవచ్చు. మొత్తానికి ఏడు దశాబ్దాల తర్వాత జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో కొత్తగా క్యూర్ చట్టం రాబోతుంది.కార్పొరేషన్లు, స్టాండింగ్ కమిటీలు, కమిషనర్లు, వార్డు కమిటీలు, ఎన్నికల నిర్వహణ, రుణాల సేకరణ అధికారాలు, ఆస్తిపన్ను మదింపు, జంతు సంరక్షణ వంటి ప్రధాన అంశాలు జీహెచ్ఎంసీ చట్టంలో ఎలా ఉన్నాయో అలానే కొనసాగుతాయి. కార్పొరేషన్లలో ఇప్పటినుంచి ట్రాన్స్‌జెండర్లకు ప్రాతినిధ్యం కల్పించే అంశాన్ని చట్టంలో చేర్చడంతోపాటు, కార్పొరేటర్ల అనర్హతకు సంబంధించిన వాటిని తొలగించడం జరిగింది.ప్రస్తుతం పాత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇంటి అద్దె ప్రాతిపదికన ఆస్తిపన్ను నిర్ధారణ ప్రక్రియ జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లో మాత్రం భూమి విలువ ఆధారిత పన్ను విధానం అమల్లో ఉంది. మున్సిపాలిటీల పరిధిలో అమలవుతోన్న భూ విలువ ఆధారిత పన్ను విధానాన్నే క్యూర్ పరిధిలో అమలు చేయాలని ఈ చట్టం ప్రతిపాదనకు వచ్చింది.సీఎం అధ్యక్షతన క్యూర్ అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్, ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏర్పాటు కానుంది. హైడ్రా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ట్రాఫిక్ నిర్వహణ, వాతావరణ మార్పులు, ఆహార భద్రత, లింగ సమానత్వం, వారసత్వ పరిరక్షణ, కార్మిక సంక్షేమం కోసం ప్రత్యేక సంస్థలు ఉంటాయి.కోర్ అర్బన్ రీజియన్ (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు) పేరుతో రూపుదిద్దుకున్న డ్రాఫ్ట్‌పై ప్రజల సూచనలు, అభిప్రాయాలను స్వీకరించి అవసరమైన మార్పులు చేసి రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న జీహెచ్ఎంసీ-1955 చట్టానికి ఇది ప్రత్యామ్నాయం.71 ఏళ్ల కిందట హైదరాబాద్‌లో 15 లక్షల జనాభా ఉండేది. దీంతో అప్పుడు ఎంసీహెచ్ (మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్) ను ఏర్పాటు చేశారు. అనంతరం ఎంసీహెచ్ చట్టానికి జీహెచ్ఎంసీ ఏర్పాటయ్యాక పేరు మార్చారు. ఇటీవల జీహెచ్ఎంసీని కూడా ప్రభుత్వం మూడు కార్పొరేషన్లుగా పునర్విభజన చేసింది. ప్రస్తుతం ఆ మూడింటిలో జీహెచ్ఎంసీ చట్టం కింద పరిపాలన చేస్తుండగా భవిష్యత్తు, ప్రస్తుత అవసరాలకు తగ్గట్లుగా చట్టంలో మార్పులు చేసి క్యూర్-2026 బిల్లు ముసాయిదాను తీసుకొచ్చింది.విపత్తుల సమయంలో సత్వర స్పందన కోసం అన్ని సంస్థలతో డిజిటల్‌తో కూడిన క్యూర్ స్మార్ట్ గవర్నెన్స్ కేంద్రం ఏర్పాటు అవుతుంది. ఫిర్యాదుల పరిష్కారం కోసం క్యూర్ అప్పిలేట్ అథారిటీ సైతం రూపుదిద్దుకోనుంది.అక్రమ నిర్మాణాలకు క్యూర్ చట్టంలో భారీ జరిమానాలు ఉంటాయి. సత్వర నిర్మాణ పర్మిషన్లు, అన్నిరకాల వ్యాపారాలకు ఒకే ట్రేడ్ లైసెన్స్, కొత్తగా నైట్ ఎకానమీ పెంపునకు మార్గదర్శకాలతో క్యూర్ బిల్లును రూపొందించారు.

# ప్రతి ప్రవాసాంధ్రుడు ఏపీకి ఒక బ్రాండ్ అంబాసిడర్ : మంత్రి లోకేశ్

**దక్షిణ కొరియాలో మంత్రి లోకేశ్ పర్యటన**

**సియోల్‌లో తెలుగు డయాస్పొరా సమావేశంలో ప్రసంగం**

**ప్రపంచవ్యాప్తంగా తెలుగువారి విజయకేతనం కనిపిస్తోందని వ్యాఖ్య**

**ప్రతి ప్రవాసాంధ్రుడు ఏపీకి ఒక బ్రాండ్ అంబాసిడరేనన్న మంత్రి**




ఆంధ్రప్రదేశ్ ప్రగతి ప్రయాణంలో ప్రవాసాంధ్రులే సిసలైన బ్రాండ్ అంబాసిడర్లని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. కియా వంటి మరిన్ని విజయవంతమైన పారిశ్రామిక నమూనాలకు ఏపీ కేరాఫ్ అడ్రస్‌గా మారబోతుందని ధీమా వ్యక్తం చేశారు. వేగం, స్థిరత్వం, సేవలే పరమావధిగా సాగుతున్న కూటమి ప్రభుత్వ '3-ఎస్' పాలనతో రాష్ట్రంలో పెట్టుబడుల విప్లవం రాబోతుందని దక్షిణ కొరియా పర్యటనలో విశ్వాసం వెలిబుచ్చారు.దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా సియోల్‌లో తెలుగు డయాస్పొరా సమావేశంలో మంత్రి లోకేశ్ కీలక ప్రసంగం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడచూసినా తెలుగువారి విజయకేతనం కనిపిస్తోందని కొనియాడారు. విదేశాల్లో ఉన్న ప్రతి ప్రవాసాంధ్రుడు ఏపీకి ఒక బ్రాండ్ అంబాసిడర్ అని వారు సాధించే ప్రతి విజయం మాతృభూమికి గర్వకారణమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పారదర్శక పాలనను, అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పాలని పిలుపునిచ్చారు.ప్రకృతి వనరుల కంటే కూడా కఠిన శ్రమ, ఆవిష్కరణలు, శాస్త్రీయ దృక్పథంతోనే దేశాలు వృద్ధి చెందుతాయని దక్షిణ కొరియా నిరూపించిందని లోకేశ్ పేర్కొన్నారు. అనంతపురంలో అడుగుపెట్టిన కియా ప్లాంట్ పూర్తిస్థాయి ఆటోమొబైల్ ఎకోసిస్టమ్‌గా ఎదిగిందని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని కొరియన్ కంపెనీలతో అలాంటి విజయగాథలను లిఖిస్తామని లోకేశ్ ఆకాంక్షించారు."తెలుగు ప్రజలు ఎక్కడ ఉన్నా ఐక్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ఏకైక లక్ష్యం. అధికారంలో ఉన్నా లేకపోయినా, తెలుగు సమాజం కోసం కలిసి పనిచేయడమే మా ఉద్దేశం. ఈ ప్రయత్నంలో మనమందరం భాగస్వాములు కావాలి. మీరే మా బ్రాండ్ అంబాసిడర్లు. మన తెలుగు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి మనం కలిసి పనిచేయాలి. అన్ని రంగాలలోనూ తెలుగు ప్రజలు గర్వపడేలా చేయడమే మా పరమావధి. ప్రభుత్వం ఎప్పుడూ మీకు తోడుగా ఉంటుంది.సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏపీ సరికొత్త అభివృద్ధి దశలోకి అడుగుపెట్టిందని లోకేశ్ అన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్ల నమ్మకాన్ని గెలుచుకునేందుకు స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ అనే '3ఎస్' మోడల్‌తో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు అంతర్జాతీయస్థాయి నైపుణ్యాలు అందించడమే ధ్యేయంగా విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నట్లు తెలిపారు. సియోల్ నుంచి సిలికాన్ వ్యాలీ వరకు మన విద్యార్థులు గ్లోబల్ మార్కెట్‌లో పోటీపడేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.దక్షిణ కొరియాలో భారత రాయబారి గౌరంగలాల్ దాస్‌తో లోకేశ్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్, ఏపీ ఎలక్ట్రానిక్స్ పాలసీ 4.0కు అనుగుణంగా శాంసంగ్, ఎల్జీ, ఎస్‌కే వంటి కొరియన్ చిప్ దిగ్గజాలు, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు ఏపీకి వచ్చేలా సహకరించాలని కోరారు.కొరియన్ చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం శ్రీసిటీలో ప్రత్యేక ప్లగ్ అండ్ ప్లే టౌన్‌షిప్ ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని లోకేశ్ పేర్కొన్నారు. కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ భారత పర్యటన దృష్ట్యా ఏపీలో కొరియా ఎన్‌క్లేవ్ ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను రాయబారికి, లోకేశ్ వివరించారు. ఏపీ తీరప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్, బ్యాటరీ టెక్నాలజీస్, గ్రీన్ హైడ్రోజన్, ఏఐ రంగాల్లో కొరియా భాగస్వామ్యం కోరారు.అనంతపురంలో ఉన్న కియా మొబిస్ ఆటోమొబైల్ రంగాన్ని ఈవీ క్లస్టర్‌గా విస్తరించే అంశంపై రాయబారితో లోకేశ్ చర్చించారు. కొరియా కంపెనీలతో నిరంతరం సమన్వయం కోసం ప్రత్యేకంగా ఏపీ-కొరియా డెస్క్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ నెల 10న సియోల్‌లో జరిగే ఇన్వెస్టర్ రోడ్‌షోను విజయవంతం చేసి కీలకమైన జీ2జీ ఒప్పందాలు కుదిరేలా రాయబార కార్యాలయం చొరవ తీసుకోవాలని కోరారు.

# కరీంనగర్‌లో షాకింగ్ క్రైమ్.. రాపిడో బైక్‌పై తీసుకెళ్లి కిడ్నాప్

**చాకచక్యంగా ప్రాణాలు దక్కించుకున్న మహిళ!**

**ఆన్‌లైన్ బెట్టింగ్‌ల వల్ల రూ.4 లక్షల అప్పు**

**ఒంటరి మహిళపై దాడి, బంగారం దోపిడీ**

**సాక్ష్యం లేకుండా చేసేందుకు బావిలోకి తోసివేత**

**రాత్రంతా బావిలోనే ఈదుతూ ప్రాణాలతో పోరాటం**

**సీసీటీవీ, టెక్నికల్ ఆధారాలతో నిందితుడి అరెస్ట్**



ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, లోన్ యాప్‌ల ఉచ్చులో పడి అప్పులపాలైన ఒక డిగ్రీ విద్యార్థి.. వాటిని తీర్చడం కోసం ఏకంగా కిడ్నాప్, దోపిడీ, హత్యాయత్నానికి ఒడిగట్టిన ఘోర ఉదంతం కరీంనగర్‌లో వెలుగుచూసింది. జగిత్యాల జిల్లాకు చెందిన ధమ్మ దినేష్ రెడ్డి అనే సెకండ్ ఇయర్ డిగ్రీ విద్యార్థి, ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్, కలర్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లలో దాదాపు రూ.4 లక్షలు నష్టపోయాడు. వీటికి తోడు పలు లోన్ యాప్‌ల ద్వారా కూడా అప్పులు చేయడంతో రుణదాతల నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురైంది. ఈ క్రమంలోనే అప్పులు తీర్చేందుకు అతడు ఒక క్రిమినల్ స్కెచ్ వేశాడు.జులై 1న గంగాధర లక్ష్మి (55) అనే దినసరి కూలీ అదృశ్యమవడంతో తొలుత ఇది మిస్సింగ్ కేసుగా నమోదైంది. కానీ పోలీసుల విచారణలో ఇది ఒక భయంకరమైన కిడ్నాప్, దోపిడీ, హత్యాయత్నంగా తేలింది. నిందితుడు దినేష్ కరీంనగర్‌లోని పలు ప్రాంతాల్లో వారం రోజుల పాటు రెక్కీ నిర్వహించి లక్ష్మిని టార్గెట్‌గా ఎంచుకున్నాడు. జులై 1న ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో నమ్మించి, రాపిడో బైక్ బుక్ చేసి తిమ్మాపూర్ వైపు తీసుకెళ్లాడు. ఆ తర్వాత ఆమెను తన సొంత బైక్‌పై ఎక్కించుకుని నుస్తులాపూర్ గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లోకి తీసుకెళ్లి దాడి చేశాడు. ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, 20 గ్రాముల వెండి మెట్టెలను దోచుకున్నాడు.ఆపై ఈ నేరానికి ఎలాంటి సాక్ష్యం ఉండకూడదనే ఉద్దేశంతో లక్ష్మిని అక్కడే ఉన్న ఒక వ్యవసాయ బావిలోకి తోసేశాడు. ఆమె చనిపోతుందని భావించాడు. అయితే, ఆమె బావిలోని ఒక తాడును పట్టుకోగా.. నిందితుడు ఆ తాడును కూడా బ్లేడుతో కోసేశాడు. ఆమె బతికే అవకాశం లేదని నమ్మి అక్కడి నుంచి పారిపోయాడు. కానీ, బాధితురాలికి ఈత రావడంతో ఆమె బావిలోని మోటార్ పైప్‌లైన్‌కు కట్టిన మరో తాడును పట్టుకుని రాత్రంతా ప్రాణాలతో పోరాడింది. మరుసటి రోజు ఉదయం పొలాల్లో పనిచేస్తున్న రైతులు ఆమె అరుపులు విని, తాళ్లు, మంచం సహాయంతో రక్షించి కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు.కరీంనగర్ పోలీసులు సీసీటీవీ ఫుటేజ్, మొబైల్ ఫోన్ రికార్డులు, ఇతర సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని మార్కెట్ పరిసరాల్లో అరెస్ట్ చేశారు. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. నిందితుడి నుంచి బాధితురాలి మొబైల్ ఫోన్లు, బైక్, రూ. 5,000 నగదు, వెండి మెట్టెలను స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన బంగారాన్ని ఒక జ్యువెలరీ షాపులో విక్రయించగా, పోలీసులు దానిని కూడా రికవరీ చేశారు. ఈ కేసులో త్వరలోనే చార్జ్‌షీట్ దాఖలు చేస్తామని పోలీసులు తెలిపారు.

# నంద్యాల జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం

**ఏఎస్సై సురేశ్ రెడ్డి దుర్మరణం , నంద్యాల-కర్నూలు జాతీయ రహదారిపై ప్రమాదం**

**ప్రమాదంలో ఆళ్లగడ్డ రూరల్ ఏఎస్సై సురేశ్ రెడ్డి అక్కడికక్కడే మృతి**

**టైరు పేలడంతో అదుపుతప్పిన క్రెటా కారు , మరో నలుగురికి తీవ్ర గాయాలు, ఆసుపత్రికి తరలింపు**



నంద్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఓ అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్ (ఏఎస్సై) అక్కడికక్కడే మృతి చెందారు. నంద్యాల-కర్నూలు జాతీయ రహదారిపై పాణ్యం మండలం తమ్మరాజుపల్లె సమీపంలో ఆదివారం ఈ దుర్ఘటన జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆళ్లగడ్డ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న సురేశ్ రెడ్డి, మరికొందరితో కలిసి అనంతపురంలో జరిగిన ఓ వివాహ వేడుకకు వెళ్లారు. తిరిగి వస్తుండగా, వారు ప్రయాణిస్తున్న క్రెటా కారు టైరు ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సురేశ్ రెడ్డి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మరణించారు. ఆయన గతంలో నంద్యాల, పాణ్యం పోలీస్ స్టేషన్లలో కూడా విధులు నిర్వర్తించారు. కారులో ఉన్న ఎస్‌బీ కానిస్టేబుల్ నాగేంద్ర ప్రసాద్ రెడ్డితో పాటు మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే సమీపంలోని శాంతిరామ్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పాణ్యం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. టైరు పేలడమే ప్రమాదానికి ప్రధాన కారణంగా ప్రాథమికంగా భావిస్తున్నారు. కాగా, ఈ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతుండటం స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది.

## రామవరం డివైడర్లలో మొక్కల దత్తత మహోద్యమం..
## పర్యావరణ పరిరక్షణకు ప్రజలు భాగస్వాములు కావాలి

**పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపు**

**మొక్కలు నాటడమే కాదు.. సంరక్షణే అసలు బాధ్యత: తూముల శ్రీనివాస్**



**భద్రాద్రి జిల్లా బ్యూరో,జూలై 6(వార్త సంధ్య) :** రామవరం పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కల దత్తత మహోద్యమంలో భాగంగా సోమవారం జాతీయ రహదారి డివైడర్లలో మొక్కలు నాటారు. కార్యక్రమాన్ని అభ్యుదయ రచయిత సంఘం అధ్యక్షుడు తూముల శ్రీనివాస్ ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలతో పాటు ప్రకృతి పరిరక్షణపై కూడా సమాజంలో చైతన్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అభ్యుదయ రచయిత నజీర్, కాంగ్రెస్ నాయకుడు మద్దికుంట గణేష్, ట్రాలీ యూనియన్ సభ్యుడు ఈశ్వర్, సీనియర్ సిటిజన్ లక్ష్మణ్, రాజ్‌కుమార్, అమన్ నారాయణ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యతరగతి సొంతింటి కల నెరవేరేదెప్పుడు

**బాధితులకు న్యాయం జరిగేనా**

**ఏళ్లు గడుస్తున్నా బాధితులకు దక్కని ఊరట**

**అటు ఆస్తి చేతికి రాక ఇటు చెల్లించిన డబ్బు పోవటంతో అవస్థలు**

**అధికంగా రాజధాని పరిధిలోనే మోసాలు**



గతంలో మూసాపేటలో వైట్ వాటర్స్ పేరుతో ఓ ప్రాజెక్టును చేపట్టారు. దాంట్లో ఫ్లాటు కొనుగోలు చేసేందుకు జగద్గిరిగుట్టకు చెందిన సతీశ్, 2020 నుంచి రూ.70 లక్షలు చెల్లించారు. అక్కడ మొత్తం ఆరు బ్లాకులుగా నిర్మాణ పనులు చేపట్టారు. కానీ అంతర్గత సమస్యలతో మధ్యలోనే పనులను నిలిపివేశారు. నిర్మాణ పనులు ఆగిపోయి దాదాపు ఆరేళ్లు అవుతుంది. అయినా ప్రాజెక్టు పూర్తికాలేదు. ఇచ్చిన డబ్బు తిరిగివ్వలేదని సతీశ్ వాపోతున్నారు. ఇలా స్థిరాస్తి మోసాల్లో చిక్కుకుపోయివారు ఎంతోమంది ఉన్నారు. మోసపోయిన వారంతా న్యాయ పోరాటం మొదలుపెట్టారు. దశాబ్దకాలం దాటుతున్న వారికి న్యాయం దక్కటంలేదు. దీంతో ఆశలు వదులుకున్నారు. అయితే ఇక్కడ అసలు సమస్య న్యాయం పొందటానికి జరుగుతున్న ఆలస్యమే బాధితులకు మరింత బాధను కలిగిస్తోంది.మధ్యతరగతి కుటుంబాలు, రిటైర్డ్ ఉద్యోగులు తినీతినక పైసపైస పోగేసుకున్నారు. సొంతింటి కలను నెరవేర్చుకోవాలనే ఉద్దేశంతో రూ. 20 లక్షల నుంచి రూ. 50 వరకూ ధారబోశారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్లాట్ ఉంటే బాగుంటుందని కొనుగోలు చేస్తున్నారు. చివరకు ఉత్తచేతులతో ఏం చేయాలేని పరిస్థితికి వెళ్తున్నారు. హైదరాబాద్ చుట్టుపక్కలే రియల్ ఎస్టేట్ మోసాలు అధికంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు రూ. 20 వేల కోట్లకు పైనే మోసాలకు పాల్పడ్డారు.రాష్ట్రంలో స్థిరాస్తి మోసాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా)ను ఏర్పాటు చేసింది. రెరా 2021 నుంచి 2025 వరకూ మొత్తం 9,445 ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చింది. దీనికి సంబంధించి 2,340 ఫిర్యాదులు నమోదు అయ్యాయి. ఈ ఫిర్యాదుల్లో 675 మోసపోయినవే ఉన్నాయి. అయితే భాధితులు రెరాలో ఫిర్యాదు చేశాక సంబంధిత అధికారులు మోసం చేసిన సంస్థను విచారించి ఉత్తర్వులు జారీచేస్తుంది. కానీ ఇక్కడా అలాంటివేమి జరగటంలేదని బాధితులు వాపోతున్నారు.సాహితీ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రాజధాని చుట్టుపక్కల మొత్తం 9 ప్రాంతాల్లో వెంచర్లు మొదలుపెట్టింది. దాదాపు 3 వేల మందిని నట్టేటా ముంచింది. ఈ సంస్థ చేసిన మోసం రూ. 3 వేల కోట్లుగా తేలింది. అయితే ఈ సంస్థ కేవలం ఉదాహరణ మాత్రమే. జయత్రి ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇండియా లిమిటెడ్, భారతీ బిల్డర్స్, వైట్ వాటర్ కన్‌స్ట్రక్షన్స్, క్రితిక ఇన్ఫ్రా డెవలపర్స్ వంటి సంస్థలు ఎన్నో మోసాల జాబితాలో ఉన్నాయి. రాజధాని పరిధిలోని పోలీసు స్టేషన్లలో సుమారు 6 వేలకు పైగా స్థిరాస్తి కేసులు దర్యాప్తు దగ్గరే ఆగిపోతున్నాయి.మోసపోయామని పోలీస్ స్టేషన్‌కు వస్తున్న బాధితులకు ప్రారంభంలోనే చుక్కెదురవుతోంది. సివిల్ వివాదాల పేరుతో వస్తున్న వారికి పోలీసులు కేసు నమోదు చేయట్లేదు. కేసు నమోదుచేసిన సందర్భాల్లో న్యాయస్థానాలు అభ్యంతరం వ్యక్తం చేస్తుండడం వల్ల పోలీసులు నిరాకరిస్తున్నారు. కేసు నమోదు చేయాలంటే ముందుగా న్యాయస్థానాన్ని ఆశ్రయించి అక్కడ నుంచి ఆదేశాలు తెచ్చుకోమని అంటున్నారు. దీంతో బాధితులు దిక్కుతోచని పరిస్థితుల్లోకి వెళ్లిపోతున్నారు.

## ఇక కూరగాయల సాగు, నాటుకోళ్ల పెంపకం మొదలెట్టాల్సిందే!

**ఎల్‌నినో వల్ల గ్రామస్థాయి ప్రణాళిక**

**రైతులకు స్థిర ఆదాయం సమకూరేలా వ్యవసాయ విధానం**

**కూరగాయలు, కోళ్లు, పశువులతో కరవును తట్టుకునే మార్గం**



ఎల్‌నినో ఎఫెక్ట్ వల్ల రాష్ట్రంలో ఆశించినంత వర్షాలు కురవడం లేదు. వర్షాకాలం మొదలై నెల పూర్తయ్యిన వానలు లేకపోవడం వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నైరుతి రుతుపవనాల సరిగ్గా లేకపోవడం వల్లే లోటు వర్షపాతం ఏర్పడింది. ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రవ్యాప్తంగా సాగు విస్తీర్ణం తగ్గింది.ఈ సంవత్సరం ఎల్‌నినో వల్ల ఏర్పడే కరవును తట్టుకునేలా, రైతులకు స్థిర ఆదాయం సమకూరేలా గ్రామంలో సమీకృత వ్యవసాయ విధానాన్ని చేపట్టాలని ఆచార్య జయశంకర్ వ్యవసాయ, కొండా లక్ష్మణ్ ఉద్యాన, పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయాలు ప్రభుత్వానికి సూచించాయి. వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ అభివృద్ధి, పశుసంవర్ధక రంగం, కోత తర్వాత కలిగే నష్టాల తగ్గింపు లక్ష్యంగా కార్యాచరణ చేపట్టాలని కోరాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు యూనివర్సిటీలు శాస్త్రవేత్తలు ఎల్‌నినోని సమర్థంగా ఎదుర్కొనే వ్యూహంపై సమగ్ర నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందించాయి.



వర్షాభావం వల్ల కూరగాయల సాగు తగ్గే అవకాశం ఉంది. ఇది పోషకాహార భద్రతను ప్రభావితం చేస్తుంది. ఈ పరిస్థితిని నివారించడానికి కూరగాయలు పెంచాలి. పంటల సాగు లేకపోతే రైతులకు ఆదాయం దెబ్బతింటుంది. ప్రతి ఇంట్లో నాటుకోళ్లను పెంచాలి. గుడ్లు, మాంసం సొంత అవసరాలకు, అమ్మడం ద్వారా ఆదాయం పొందవచ్చు.వాతావరణంలోని మార్పులకు తగిన వ్యవసాయం, ఉద్యానాల అభివృద్ధిని చేపట్టాలి. పంట మార్పిడి, వర్షపు నీటి సంరక్షణ, నేల తేమ పరిరక్షణ, సూక్ష్మ నీటిపారుదల వంటి సాంకేతికతలను గ్రామాల్లో ప్రదర్శన ద్వారా రైతులకు చేరవేయాలి. రాష్ట్రంలోని 16 కృషి విజ్ఞాన కేంద్రాలకు ఈ కీలక బాధ్యతలు అప్పగించాలి. ప్రతిచోట నమూనా కేంద్రాలను ఏర్పాటు చేయాలి. ఆయా జిల్లాలో పంటలు, పాడి పశువులు, తోటలు, మేకలు, చేపల పెంపకం, వర్మీ కంపోస్టు వంటి అనుబంధ కార్యాకలాపాలను అమలు చేయాలి.వ్యవసాయ ఉత్పత్తులలో నష్టాలను తగ్గించేందుకు పంటల గ్రేడింగ్, శుభ్రపరిచే విధానాలు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, శాస్త్రీయ నిల్వ, మార్కెటింగ్, ప్యాకేజింగ్, ప్రాసెసింగ్ వంటివాటిపై రైతులకు శిక్షణ ఇవ్వాలి.కేవీకేలతో అధిక పాలు ఉత్పత్తి చేసే మెరుగైన జాతుల పెంపకం, కృత్రిమ గర్భధారణ, పచ్చిమేత ఉత్పత్తి, పశువుల ఆరోగ్య శిబిరాలు, వ్యాధి నియంత్రణ చర్యలపై అన్నదాతలకు అవగాహన కల్పించాలి.

### చీ..ఉలవలు తింటారా అనుకోవద్దు..

## రేసు గుర్రంలా ఉరికే ఆరోగ్యం కోసం..



జ్వరం, ఆయాసం, దగ్గు వంటి సమస్యలతో బాధపడేవారు ఉలవల కషాయం తాగడం ఎంతో మేలు. ఈ కషాయం జ్వరం, దగ్గు వంటి సమస్యల నుంచి తక్షణ ఉపశమనం అందిస్తుంది. అంతేకాదు.. తరచూ ఎక్కిళ్లు వచ్చేవారికి ఉలవలు మంచి మందులా పనిచేస్తుంది. తరచూ ఉలవలు తీసుకోవడం వల్ల ఎక్కిళ్ల సమస్య నుంచి తక్షణ ఉపశమనం పొందుతారు. ఉలవలు..మంచి బలవర్ధకమైన ఆహారం. మన శరీరానికి శక్తిని అందించడంతో పాటు అనేక అనారోగ్య సమస్యలను దూరం చేస్తాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఉలవల్లో ఫైబర్ పుష్కలగా ఉంటుంది. ప్రోటీన్, ఐరన్, కాల్షియం, ఫాస్ఫరస్, పీచుపదార్థం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఊబకాయం సమస్య ఉన్నవారు ఉలవలను తినటం మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఉలవల్లోని ఫైబర్ శరీరంలో చెడు కొలెస్ట్రాల్ కరిగించడంలో దోహదపడుతుంది. తద్వారా బరువు అదుపులో ఉంచుతుంది. మూత్ర సంబంధిత సమస్యలు నివారించడంలో ఉలవలు సహాయపడతాయి. దీనికోసం ఓ కప్పు ఉలవ చారుకు సమానంగా కొబ్బరి నీళ్లు తీసుకుంటే మూత్రంలో మంట తగ్గుతుంది. తరచూ మూత్రంలో మంటతో బాధపడేవారు ఈ చిట్కా పాటించండి. జ్వరం, ఆయాసం, దగ్గు వంటి సమస్యలతో బాధపడేవారు ఉలవల కషాయం తాగడం ఎంతో మేలు. ఈ కషాయం జ్వరం, దగ్గు వంటి సమస్యల నుంచి తక్షణ ఉపశమనం అందిస్తుంది. అంతేకాదు.. తరచూ ఎక్కిళ్లు వచ్చేవారికి ఉలవలు మంచి మందులా పనిచేస్తుంది. తరచూ ఉలవలు తీసుకోవడం వల్ల ఎక్కిళ్ల సమస్య నుంచి తక్షణ ఉపశమనం పొందుతారు. కిడ్నీ సమస్యల నుంచి ఉపశమనం కల్పించడంలో ఉలవలు దోహదపడతాయి. వీటిలోని పోషకాలు కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా రక్షిస్తాయి. అంతేకాదు హృదయ సంబంధ సమస్యలు రాకుండా ఉలవలు రక్షిస్తాయి. పిల్లల ఎదుగుదలకు ఉలవలు ఎంతో మేలు చేస్తాయి. ఇవి పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యానికి సహాయపడతాయి. వారికి బలాన్ని ఇస్తాయి. అనారోగ్య సమస్యలు రాకుండా కాపాడతాయి. చర్మ సమస్యల నివారణలో, కీళ్ళ నొప్పుల నివారణలో బాగా పని చేస్తాయి.

### చియా సీడ్స్, నల్ల ఎండు ద్రాక్ష కలిపి

## నానపెట్టి తీసుకుంటే ఇన్ని లాభాలా..?



చియా విత్తనాలు ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచుతాయి. ఎండుద్రాక్ష స్వీట్ తినాలన్న కోరికను తగ్గిస్తుంది. వాటి నీరు కొవ్వును వేగంగా కరిగిస్తుంది. బరువు తగ్గడానికి సహాయ పడుతుంది. నల్ల ఎండుద్రాక్ష, చియా విత్తనాలు రెండూ యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇవి నానబెట్టిన నీటిని ప్రతిరోజూ ఉదయం తాగడం వల్ల చర్మం ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా మారుతుంది. నల్ల ఎండుద్రాక్ష, చియా విత్తనాల నీరు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఈ రెండింటినీ కలిపి తాగడం వల్ల శరీరానికి లోపలి నుంచి పోషణ, శక్తి లభిస్తాయి. నల్ల ఎండుద్రాక్షలో ఐరన్, చియా విత్తనాలలో ఫైబర్, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. వీటి నీటిని తాగడం వల్ల శరీరంలో హిమోగ్లోబిన్ పెరిగి రక్తహీనత సమస్య తొలగిపోతుంది. చియా విత్తనాలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఎండుద్రాక్ష కూడా జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇవి నానబెట్టిన నీరు మలబద్ధకం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలను తొలగిస్తుంది. నల్ల ఎండుద్రాక్షలో విటమిన్ సి, చియా విత్తనాలలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. వీటి నీరు రోగ నరోధక శక్తిని పెంచుతుంది. జలుబు, ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. ఎండుద్రాక్ష, చియా విత్తనాలలో ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు, పొటాషియం ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ ను నియంత్రిస్తాయి. వాటి నీరు గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ రెండింటిలో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు ఉన్నాయి. ప్రతిరోజూ వాటి నీటిని తాగడం వల్ల ఎముకలు బలోపేతం అవుతాయి. నల్ల ఎండుద్రాక్ష, చియా విత్తనాలు రెండూ సహజ చక్కెర, ప్రోటీన్ కలిగి ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని ఇస్తాయి. ఉదయాన్నే వీటి నీటిని తాగడం వల్ల రోజంతా చురుగ్గా ఉండవచ్చు. చియా విత్తనాలు ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచుతాయి. ఎండుద్రాక్ష స్వీట్ తినాలన్న కోరికను తగ్గిస్తుంది. వాటి నీరు కొవ్వును వేగంగా కరిగిస్తుంది. బరువు తగ్గడానికి సహాయ పడుతుంది. నల్ల ఎండుద్రాక్ష, చియా విత్తనాలు రెండూ యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇవి నానబెట్టిన నీటిని ప్రతిరోజూ ఉదయం తాగడం వల్ల చర్మం ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా మారుతుంది.

### పొరపాటున కూడా ఉదయం ఖాళీ

## కడుపుతో ఇవి అస్సలు తినకండి.. పెద్ద ప్రమాదమే!



ఉదయం అల్పాహారంలో తినడం వల్ల కడుపులో అసౌకర్యం, శక్తి లేకపోవడం లేదా పోషకాలను సరిగా గ్రహించకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. రోజు మీ అల్పాహారం సమతుల్యంగా ఉండటం ముఖ్యం. ఇందులో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వు, సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు ఉంటాయి.. కొన్ని ఆహారాలు ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా భావిస్తారు. కానీ ఉదయం అల్పాహారంలో వాటిని తినడం ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు వైద్య నిపుణులు. కొన్ని ఆహారాలను ఖాళీ కడుపుతో తినడం వల్ల మీ శరీరంపై ప్రతిచర్యలు కలుగుతాయి. ఈ ఆహారాలలో పోషకాలు పుష్కలంగా ఉన్నప్పటికీ, ఆమ్లత్వం, ఫైబర్, చక్కెర అధికంగా ఉండే ఈ పదార్థాలను ఉదయం అల్పాహారంలో తినడం వల్ల కడుపులో అసౌకర్యం, శక్తి లేకపోవడం లేదా పోషకాలను సరిగా గ్రహించకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. రోజు మీ అల్పాహారం సమతుల్యంగా ఉండటం ముఖ్యం. ఇందులో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వు, సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఉదయాన్నే మీరు ఏమి తినకూడదో తెలుసుకుందాం. సిట్రస్ పండ్లు: సిట్రస్ పండ్లలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కానీ వాటి అధిక ఆమ్లత్వం ఖాళీ కడుపుతో తింటే కడుపు పొరను చికాకుపెడుతుంది. ఇది ముఖ్యంగా యాసిడ్ రిఫ్లక్స్ ఉన్నవారిలో అసౌకర్యాన్ని కలిగిస్తుంది.

**పచ్చి కూరగాయలు:** పచ్చి కూరగాయలలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. కానీ వాటిలో కరగని ఫైబర్ కూడా ఎక్కువగా ఉంటుంది. వీటిని ఖాళీ కడుపుతో తింటే హానికరం కావచ్చు. ఉదయం వాటిని తినడం వల్ల ఉబ్బరం, గ్యాస్ లేదా కడుపు తిమ్మిర్లు వస్తాయి.

**గ్రానోలా:** ప్రజలు తరచుగా వాటిని ప్రయోజనకరంగా భావిస్తారు, కానీ గ్రానోలాలో అధిక మొత్తంలో చక్కెర మరియు శుద్ధి చేసిన నూనె ఉంటాయి. ఉదయం ఖాళీ కడుపుతో చక్కెరతో కూడిన వస్తువులను తినడం వల్ల శక్తి తగ్గుతుంది.

**గ్రీన్ స్మూతీ:** కాలే, పాలకూర వంటి ఆకు కూరలు ఆరోగ్యకరమైనవి. కానీ మీరు వాటిని పచ్చిగా తింటే వాటిలో అధిక మొత్తంలో ఆక్సలేట్, ఫైబర్ ఉంటాయి. ఖాళీ కడుపుతో వీటిని తీసుకోవడం వల్ల కాల్షియం లోపం నిరోధించవచ్చు. దీనివల్ల మీరు ఉబ్బరం లేదా గ్యాస్ వంటి సమస్యలను ఎదుర్కొంటారు. ఎల్లప్పుడూ ఉడికించిన వాటిని తినండి.

**టమోటాలు:** యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. టమోటాలు చాలా పుల్లగా ఉంటాయి. అల్పాహారంగా వీటిని తినడం వల్ల కడుపు పొర చికాకు కలిగిస్తుంది. కాలక్రమేణా గ్యాస్ట్రిటిస్ లేదా యాసిడ్ రిఫ్లక్స్ సమస్యను పెంచుతుంది.

**అరటిపండ్లలో.. :** పొటాషియం పుష్కలంగా ఉంటుంది. కానీ చక్కెర అధికంగా ఉంటుంది. ఖాళీ కడుపుతో తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి పెరుగుతుంది. రక్తంలో మెగ్నీషియం అకస్మాత్తుగా పెరుగుతుంది. ఇది గుండె ఆరోగ్యాన్ని పాడు చేస్తుంది.

## స్వీట్లు తిన్న 30 నిమిషాల్లో.. శరీరంలో ఏం జరుగుతుందో తెలుసా?

**చక్కెర తిన్న 30 నిమిషాల్లోనే శరీరంలో కీలక మార్పులు**

**అధిక చక్కెర వాడకం కాలేయం, గుండె ఆరోగ్యానికి చేటు**

**ఘన పదార్థాల కన్నా కూల్ డ్రింక్స్‌లోని చక్కెర మరింత ప్రమాదకరం**

**శీతల పానీయాలతో టైప్-2 డయాబెటిస్ ముప్పు 20 శాతం అధికం**

**రోజుకు 25 గ్రాములకు మించి చక్కెర వాడొద్దని డబ్ల్యూహెచ్ఓ సూచన**



మనం ఇష్టంగా తినే స్వీట్లు, చక్కెర పదార్థాలు నోటికి రుచిని పంచినా, అవి తిన్న కేవలం అరగంటలోనే మన శరీరంలో పెను మార్పులకు కారణమవుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చక్కెర శరీరంలోకి చేరగానే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు వేగంగా పెరుగుతాయి. దీనిని అదుపులోకి తెచ్చేందుకు ప్యాంక్రియాస్ ఇన్సులిన్‌ను విడుదల చేస్తుంది. ఇదే సమయంలో మెదడులో 'డోపమైన్' అనే హార్మోన్ విడుదలై తాత్కాలికంగా ఆనందాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తుంది.అయితే ఈ ఉత్సాహం కొద్దిసేపే ఉంటుంది. అరగంట తర్వాత రక్తంలోని చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పడిపోవడంతో 'షుగర్ క్రాష్'కు గురవుతాం. దీనివల్ల నీరసం, మళ్లీ ఆకలిగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

**అంతర్గత అవయవాలపై తీవ్ర ప్రభావం**

అధిక చక్కెర వినియోగం కాలేయంపై తీవ్ర ఒత్తిడిని కలుగజేస్తుంది. అదనపు చక్కెరను కాలేయం కొవ్వుగా మార్చడం వల్ల కాలక్రమేణా 'ఫ్యాటీ లివర్' సమస్య తలెత్తుతుంది. అంతేకాకుండా, రక్తనాళాల్లో వాపు (ఇన్‌ఫ్లమేషన్) ఏర్పడి గుండె సంబంధిత వ్యాధుల ముప్పు పెరుగుతుంది. చర్మంపై ముడతలు రావడం, రోగనిరోధక శక్తి తగ్గడం వంటి సమస్యలకు కూడా అధిక చక్కెర వాడకమే కారణమని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.ఇటీవల జరిపిన పరిశోధనల ప్రకారం మనం తినే ఘన పదార్థాల కన్నా శీతల పానీయాల్లోని 'లిక్విడ్ షుగర్' కేవలం 15 నిమిషాల్లోనే రక్తంలో కలిసిపోతుందని తేలింది. దీనివల్ల టైప్-2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం 20 శాతం అధికంగా ఉంటుందని ప్రముఖ వైద్య పత్రిక 'ల్యాన్సెట్' తన కథనంలో పేర్కొంది. చక్కెరను పూర్తిగా మానేయడం కష్టమైనప్పటికీ, రోజుకు 25 గ్రాములకు మించి తీసుకోకపోవడం ఆరోగ్యానికి శ్రేయస్కరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సూచిస్తోంది.

## మీ బడ్జెట్?లో యూరప్ ట్రిప్.. టాప్ 5 చౌక యూరప్ దేశాలు ఇవే..











యూరప్‌కు వెళ్లడం ఎల్లప్పుడూ ఖరీదైనదిగా ఉండనవసరం లేదు. చాలా మంది యూరప్ అంటే పారిస్, లండన్ లేదా రోమ్ వంటి పెద్ద నగరాలు అని అనుకుంటారు. ఇది చాలా ఖరీదైనది కావచ్చు. కానీ నిజం ఏమిటంటే యూరప్‌లో చాలా అందమైన, సరసమైన దేశాలు ఉన్నాయి. ఇక్కడ మీరు ఎక్కువ డబ్బు ఖర్చు చేయకుండా గొప్ప సమయాన్ని గడపవచ్చు. యూరప్‌లోని 5 చౌక దేశాలు ఏంటి.? ఈరోజు తెలుసుకుందాం..

**బల్గేరియా:** యూరప్‌లో సందర్శించడానికి అత్యంత చౌకైన ప్రదేశాలలో బల్గేరియా ఒకటి. రంగులు, చరిత్రతో నిండిన ప్లోవ్‌డివ్ పాత పట్టణం గుండా మీరు నడవవచ్చు. ఎండ ఎక్కువగా ఉండే, రద్దీగా లేని నల్ల సముద్రం వెంబడి ఉన్న బీచ్‌లను కూడా మీరు ఆస్వాదించవచ్చు. మీరు ప్రకృతిని ఇష్టపడితే, హైకింగ్ లేదా స్కీయింగ్ కోసం పర్వతాలను వీక్షించవచ్చు. ఇక్కడ ఆహారం చౌకగా, రుచికరంగా ఉంటుంది. పబ్లిక్ బస్సులు, రైళ్లు ఉపయోగించడానికి సులభమైనవి, చాలా సరసమైనవి. డబ్బు ఆదా చేయాలనుకునే ప్రయాణికులకు ఈ దేశం నిజంగా మంచిది.

**రొమేనియా:** రొమేనియా ఒక అద్భుత కథలోని ప్రదేశంలా అనిపిస్తుంది. మీరు డ్రాక్యులా కోట అని పిలువబడే ప్రసిద్ధ బ్రాన్ కోట వంటి కోటలను సందర్శించవచ్చు. ఈ దేశం పచ్చని కొండలు, ప్రశాంతమైన గ్రామాలు, పాత సంప్రదాయాలతో నిండి ఉంది. ట్రాన్సిల్వేనియా అన్వేషించడానికి గొప్ప ప్రాంతం, మీరు హైకింగ్ లేదా ప్రకృతి పర్యటనలను ఇష్టపడితే కార్పాతియన్ పర్వతాలు ఉన్నాయి. రాజధాని బుకారెస్ట్‌లో చాలా పార్కులు, మ్యూజియంలు, చూడటానికి సరదా ప్రదేశాలు ఉన్నాయి. ఉత్తమ భాగం ఏమిటంటే ప్రతిదీ చాలా ఇతర యూరోపియన్ దేశాల కంటే చాలా చౌకగా ఉంటుంది.

**అల్బేనియా:** అల్బేనియా అంతగా ప్రసిద్ధి చెందలేదు. కానీ ఇది యూరప్‌లోని ఉత్తమ బడ్జెట్ గమ్యస్థానాలలో ఒకటి. ఇది గ్రీస్‌లో ఉన్న బీచ్‌ల మాదిరిగానే కనిపించే శుభ్రమైన నీలిరంగు బీచ్‌లను కలిగి ఉంది. ప్రజలు దయగలవారు. ఆహారం తాజాగా మరియు రుచితో నిండి ఉంటుంది. రాతి ఇళ్ళు, అద్భుతమైన దృశ్యాలను కలిగి ఉన్న బెరాట్, జిరోకాస్టర్ వంటి పాత పట్టణాలను మీరు సందర్శించవచ్చు. ఎక్కువ మంది పర్యాటకులు ఉండరు కాబట్టి ఇది మరింత ప్రశాంతంగా, ప్రత్యేకంగా అనిపిస్తుంది. బీచ్ సంస్కృతి, పొదుపు కోరుకునే వ్యక్తులకు అల్బేనియా సరైనది.

**పోలాండ్:** పోలాండ్ చరిత్ర, ఆకర్షణలతో నిండి ఉంది. క్రాకో, వార్సా వంటి నగరాల్లో అందమైన వీధులు, పాత భవనాలు, ఆనందించడానికి చాలా సంస్కృతి ఉన్నాయి. క్రాకో చౌకగా, శక్తితో నిండినందున విద్యార్థులు, బ్యాక్‌ప్యాకర్లకు చాలా నచ్చుతుంది. మీరు రుచికరమైన పోలిష్ ఆహారాన్ని ప్రయత్నించవచ్చు. మ్యూజియంలను సందర్శించండి. ఎక్కువ డబ్బు ఖర్చు చేయకుండా నడక పర్యటనలకు వెళ్లండి. మీరు ప్రకృతిని ఇష్టపడితే పోలాండ్‌లో అందమైన గ్రామీణ సరస్సులు, అడవులు కూడా ఉన్నాయి. మీరు బడ్జెట్‌లో ప్రయాణిస్తుంటే యూరప్‌లో వెళ్ళడానికి ఇది ఉత్తమమైన ప్రదేశాలలో ఒకటి.

**హంగేరీ:** బడ్జెట్ ప్రయాణికులకు హంగేరీ మరో అగ్ర ఎంపిక. రాజధాని నగరం బుడాపెస్ట్ వెచ్చని స్నానపు గదులు, వంతెనలు, అద్భుతమైన భవనాలకు ప్రసిద్ధి చెందింది. ఇది గతం నుంచి వచ్చిన నగరంలా కనిపిస్తుంది. కానీ ఇప్పటికీ జీవితం, వినోదంతో నిండి ఉంది. మీరు చౌకైన ఆహారం, చౌకైన బస స్థలాలను కనుగొనవచ్చు. ఇది సుదీర్ఘ పర్యటనలకు గొప్పగా చేస్తుంది. దేశంలోని ఇతర ప్రాంతాలలో కోటలు, చిన్న పట్టణాలు, సరస్సులు కూడా ఉన్నాయి. హంగేరీ అందం, చరిత్ర కలిగి ఉంది.

## అరటి పండు తిన్న తర్వాత ఈ పదార్థాలు తింటున్నారా..? మీ లైఫ్ డెంజర్‌లో పడినట్టే..







అరటి పండులో లెక్కలేనన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. దీనిని పోషకాల పవర్ హౌస్ అంటారు. ఈ పండులో అనేక రకాల పోషకాలు ఉంటాయి. దీన్ని తినడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. అరటి పండులో మెగ్నీషియం, పొటాషియం, పీచు మొదలైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అరటి పండుతో అనేక ప్రయోజనాలున్నప్పటికీ.. కొన్ని ఫుడ్స్‌తో కలిపి తినకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాంటి ఆహారాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.. అరటిపండు తిన్న తర్వాత పుల్లని పండ్లు తినకూడదు. అరటిపండు తిన్న తర్వాత పుల్లని పండ్లు తినడం వల్ల అజీర్ణం చేస్తుంది. దీంతో జీర్ణ సమస్యలు తలెత్తుతాయి. అలాగే, అరటిపండ్లు, పాలు ఎప్పుడూ కలిపి తినకూడదని నిపుణులు చెబుతున్నారు. ఈ కలయిక మీ ఆరోగ్యానికి హానికరం. అరటిపండ్లు తిన్న తర్వాత వీటిని తీసుకోవడం వల్ల పొట్ట సమస్యలు కలిగిస్తాయి. అరటిపండు తిన్న తర్వాత పుల్లని పండ్లు తినకూడదు. అరటిపండు తిన్న తర్వాత పుల్లని పండ్లు తినడం వల్ల అజీర్ణం చేస్తుంది. దీంతో జీర్ణ సమస్యలు తలెత్తుతాయి. అలాగే, అరటిపండ్లు, పాలు ఎప్పుడూ కలిపి తినకూడదని నిపుణులు చెబుతున్నారు. ఈ కలయిక మీ ఆరోగ్యానికి హానికరం. అరటిపండ్లు తిన్న తర్వాత వీటిని తీసుకోవడం వల్ల పొట్ట సమస్యలు కలిగిస్తాయి.

అరటిపండ్లు తిన్న తర్వాత తీపి పదార్థాలు కూడా తినకూడదని నిపుణులు చెబుతున్నారు. అరటిపండ్లు తిన్న తర్వాత వాటిని తీసుకోవడం వల్ల శరీరంలో రక్తంలో చక్కెర స్థాయి పెరుగుతుంది. మధుమేహం లేకపోయినా అరటి పండు తర్వాత స్వీట్స్ తినకూడదని చెబుతున్నారు.

అంతేకాదు.. రాత్రిపూట కూడా అరటి పండును అస్సలు తినకూడదని నిపుణులు చెబుతుంటారు. బనానా తిన్న తర్వాత వేయించిన పదార్థాలు తినకూడదు. కారంతో చేసిన పదార్థాలకు వీలైనంత దూరంగా ఉండాలి. కాఫీలు, టీలు బనానా తిన్నాక తాగడం మానేయాలి. దీని వల్ల జీర్ణసమస్యలు , అలెర్జీలు, ముఖంపై మచ్చలు వస్తాయి.

అలాగే అరటిపండు తిన్న తర్వాత కాఫీ తాగకూడదు. ఈ సమయంలో కాఫీ తాగడం వల్ల మలబద్ధకం ఏర్పడుతుంది. అరటిపండు తిన్న వెంటనే చల్లటి నీరు తాగకూడదు. దీనివల్ల జీర్ణ ప్రక్రియలో ఆటంకాలు ఏర్పడతాయి. రాత్రిపూట సాధ్యమైనంతవరకు అరటి పండును తినకపోవడమే మేలు.

బంగాళదుంప, అరటి పండును కలిపి తినకూడదని నిపుణులు చెబుతున్నారు. బంగాళదుంపలో పిండిపదార్థం ఎక్కువగా ఉంటుంది. రెండింటినీ కలిపి తినడం వల్ల జీర్ణ సమస్యలు, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు ఏర్పడవచ్చు. అందుకే ఈ రెండిండి కాంబినేషన్‌కు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

## అలసత్వం వద్దు.. నిద్ర తగ్గితే వచ్చే 5 ప్రమాదకర సమస్యలు ఇవే



నిద్ర అనేది మనిషి ఆరోగ్యం, శ్రేయస్సులో అత్యంత ముఖ్యమైన భాగం. అవసరమైన గంటలు నిద్ర లేకపోవడం, మంచి నాణ్యత గల నిద్ర దొరకకపోవడం వల్ల ఆరోగ్యంపై అనేక విధాలుగా ప్రభావం పడుతుంది. ప్రతిరోజూ కనీసం 7-8 గంటలు నిద్రపోవడం చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. అయితే, చాలామంది తమ నిద్ర సమయాన్ని ఇతర పనుల కోసం కేటాయించి విశ్రాంతి తీసుకోవడం లేదు ఇలా చేయడం వల్ల కేవలం నిద్ర ఆరోగ్యంపైనే కాదు, మొత్తం శరీరం, శ్రేయస్సుపైనా ప్రతికూల ప్రభావం పడుతుంది. బరువు పెరగడం నుంచి క్యాన్సర్, మధుమేహం, డిప్రెషన్ వంటి తీవ్రమైన వ్యాధుల ముప్పు పెరగడం వరకు, ఈ జాబితా అంతులేనిది. అందుకే, చక్కగా నిద్రపోవడం అత్యవసరం. మీరు నిద్ర గంటలను తగ్గించుకుంటే మీ శరీరానికి ఏమి జరుగుతుందో తెలుసుకోండి..

**1. బరువు పెరుగుట:** మీరు నిద్ర లేకపోతే, అది ఆకలిని నియంత్రించే హార్మోన్లైన 'ఘ్రెలిన్', 'ల్యాప్టిన్' సమతుల్యతను ప్రభావితం చేస్తుంది. దీనివల్ల మీకు అధిక కేలరీలు, చక్కెర పదార్థాలపై కోరిక పెరిగి, ఎక్కువగా తినేలా చేస్తుంది. ఇది తక్కువ శక్తి, తక్కువ శారీరక శ్రమతో కలిసి బరువు పెరగడానికి దారితీస్తుంది.

**2. టైప్ 2 మధుమేహం ప్రమాదం:** మీరు నిద్రలేమితో బాధపడుతున్నప్పుడు, ఇన్సులిన్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకునే మీ శరీర సామర్థ్యం దెబ్బతింటుంది. దీనివల్ల 'ఇన్సులిన్ రెసిస్టెన్స్' ఏర్పడుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది, కాలక్రమేణా టైప్ 2 మధుమేహానికి దారితీస్తుంది.

**3. గుండె జబ్బుల ప్రమాదం:** నిద్రలేమి గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది అధిక రక్తపోటుకు దారితీస్తుంది, 'కార్టిసాల్' వంటి ఒత్తిడి హార్మోన్లను పెంచుతుంది మరియు మంటను కలిగిస్తుంది. ఈ కారకాలన్నీ కలిసి గుండె జబ్బులు, స్ట్రోక్ మరియు ఇతర గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతాయి.

**4. బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ:** నిద్రలో మీ శరీరం 'సైటోకైన్‌లను' విడుదల చేస్తుంది, ఇవి అంటువ్యాధులు మరియు మంటలతో పోరాడటానికి సహాయపడతాయి. అయితే, మీకు అవసరమైన నిద్ర లేకపోతే, సైటోకైన్ ఉత్పత్తి తగ్గుతుంది. ఇది రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. **5. క్యాన్సర్ ప్రమాదం:** తక్కువ నిద్ర దెబ్బతినడాన్ని సరిచేసే మరియు కణాల పెరుగుదలను నియంత్రించే శరీర సామర్థ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. దీనితో పాటు, ఇది 'మెలటోనిన్' ఉత్పత్తిని కూడా ప్రభావితం చేస్తుంది, ఇది రొమ్ము, ప్రోస్టేట్ మరియు కొలొరెక్టల్ క్యాన్సర్ వంటి కొన్ని క్యాన్సర్ల అభివృద్ధికి దారితీస్తుంది

# మెటాకు కేంద్రం నోటీసులు- ఆ ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనలను తక్షణమే తొలగించాలని ఆదేశాలు

**ఇన్‌స్టాగ్రామ్‌లో అభ్యంతరకర ప్రకటనలపై కేంద్రం ఆగ్రహం**

**సంబంధిత ప్రకటనలు, కంటెంట్‌ను వెంటనే తొలగించాలని ఆదేశం**

**ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని మెటాకు నోటీసులు**




చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను ప్రోత్సహించేలా ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటనలు కనిపిస్తున్నాయన్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. చిన్నారుల లైంగిక దోపిడీ, వేధింపులకు సంబంధించిన కంటెంట్ (జూజూవీ)ను ప్రోత్సహించే పెయిడ్ యాడ్స్‌తో పాటు సంబంధిత కంటెంట్‌ను వెంటనే తొలగించాలని మెటాను ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ (మీవత్) మెటాకు నోటీసులు జారీ చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.ఈ వ్యవహారంపై ఏడు రోజుల్లోగా సమగ్ర వివరణ ఇవ్వాలని కేంద్రం స్పష్టం చేసింది. నిర్ణీత గడువులోగా సరైన సమాధానం ఇవ్వకపోయినా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. చిన్నారుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని తేల్చిచెప్పింది. ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్నారులపై లైంగిక వేధింపులను ప్రోత్సహించేలా ఉన్న ప్రకటనలకు అసలు ఎలా ఆమోదం లభించిందని కేంద్రం ప్రశ్నించింది. ప్రకటనల పరిశీలన, ఆమోద ప్రక్రియలో ఎక్కడ లోపాలు జరిగాయో వివరించాలని మెటాను కోరింది. ఈ ఆరోపణలు వెలుగులోకి వచ్చిన తర్వాత ఎలాంటి దిద్దుబాటు చర్యలు తీసుకున్నారో కూడా తెలియజేయాలని ఆదేశించింది.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి సాంకేతిక, భద్రతాపరమైన చర్యలు తీసుకుంటారో స్పష్టత ఇవ్వాలని కేంద్రం పేర్కొంది. ముఖ్యంగా చిన్నారులకు హాని కలిగించే కంటెంట్‌ను గుర్తించడం, తొలగించడం, సంబంధిత ఖాతాలు, ప్రకటనదారులపై చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై సమగ్ర సమాచారం ఇవ్వాలని కోరినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇటీవల వెలుగులోకి వచ్చిన ఓ మీడియా సంస్థ దర్యాప్తు కథనం నేపథ్యంలో ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మెటాకు చెందిన రికమెండేషన్ అల్గారిథమ్ చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన వీడియోలను ప్రోత్సహిస్తోందని ఆ కథనంలో ఆరోపణలు వచ్చాయి. అంతేకాకుండా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో అభ్యంతరకర ప్రకటనలు కూడా కనిపించినట్లు పేర్కొంది.మెటా ప్రకటనల విధానాల్లో నగ్నత్వం, లైంగికంగా అభ్యంతరకరమైన కంటెంట్‌పై స్పష్టమైన నిషేధం ఉంది. అయినప్పటికీ ఇలాంటి ప్రకటనలు ఎలా కనిపించాయన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. కొన్ని పెయిడ్ యాడ్స్‌లో అభ్యంతరకర పదాలను ఉపయోగించడంతో పాటు.. వినియోగదారులను టెలిగ్రామ్ ఛానళ్ల వైపు మళ్లించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆయా ఛానళ్లలో చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను విక్రయిస్తున్నట్లు కూడా కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ వ్యవహారంపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మెటా ప్రతినిధులను పిలిపించి వివరణ కోరాలని సూచించారు. ఆ తర్వాత కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ మెటాకు అధికారికంగా నోటీసులు జారీ చేసింది.ఈ వ్యవహారంలో థర్డ్ పార్టీ కంటెంట్ అనే వాదనతో మెటా బాధ్యత నుంచి తప్పించుకోలేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. సాధారణంగా సోషల్ మీడియా వేదికల్లో వినియోగదారులు పోస్ట్ చేసే కంటెంట్ విషయంలో మధ్యవర్తి సంస్థలకు కొన్ని చట్టపరమైన రక్షణలు ఉంటాయి. అయితే ప్రస్తుతం వచ్చిన ఆరోపణలు పెయిడ్ యాడ్స్‌కు సంబంధించినవని అధికారులు పేర్కొంటున్నారు. ప్రకటనల ద్వారా మెటాకు ఆదాయం వస్తున్నందున వాటి విషయంలో సంస్థకు బాధ్యత ఉంటుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఆరోపణలు నిజమని తేలితే ప్రకటనలను ప్రచురించిన వేదిక కూడా జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని స్పష్టం చేశాయి. ఈ అంశాన్ని సాంకేతిక, నియంత్రణ పరమైన కోణాల్లో కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ పరిశీలించనుంది.అదే సమయంలో చట్ట ఉల్లంఘనలు జరిగినట్లు భావిస్తే సంబంధిత ప్రకటనదారులు లేదా సోషల్ మీడియా వేదికలపై ప్రభుత్వ సంస్థలు, అధికారులు లేదా వ్యక్తులు కూడా ఫిర్యాదు చేసే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం మొదటి నుంచి జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తోంది. ఆన్‌లైన్ వేదికలు ఇలాంటి కంటెంట్‌ను వెంటనే గుర్తించి, తొలగించడంతో పాటు సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని స్పష్టం చేస్తోంది. డిజిటల్ ప్రపంచంలో చిన్నారులకు రక్షణ కల్పించేందుకు మరింత బలమైన భద్రతా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సోషల్ మీడియా సంస్థలను కోరుతోంది.ఇంటర్‌పోల్ నుంచి అందిన సమాచారం ఆధారంగా చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్ ఉన్న వెబ్‌సైట్లను కేంద్ర ప్రభుత్వం గతంలో పలుమార్లు బ్లాక్ చేసింది. సీబీఐ ద్వారా అందిన జాబితాల ఆధారంగా ఈ చర్యలు చేపట్టింది. హానికరమైన కంటెంట్‌ను నియంత్రించడంలో టెక్నాలజీ సంస్థలు విఫలమైతే నియంత్రణ సంస్థల విచారణతో పాటు చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని కేంద్రం ఇప్పటికే పలుమార్లు హెచ్చరించింది. కాగా, ఈ వారంలో మెటాకు కేంద్రం నోటీసులు జారీ చేయడం ఇది రెండోసారి కావడం గమనార్హం. వాట్సాప్‌లో తీసుకురావాలని భావిస్తున్న యూజర్‌నేమ్ ఫీచర్‌పైనా కేంద్రం ఇటీవల అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ ఫీచర్ వల్ల ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, ఇతరుల పేరుతో మోసాలకు పాల్పడే ఘటనలు పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.ప్రభుత్వంతో సంప్రదింపులు పూర్తయ్యే వరకు వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌ను నిలిపివేయాలని కేంద్రం ఆదేశించింది. ఈ వ్యవహారంపై కూడా మెటా ప్రతినిధులు ఐటీ మంత్రిత్వ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. కేంద్రం కోరిన విధంగా నిర్ణీత గడువులోగా సమగ్ర వివరణ ఇచ్చేందుకు సంస్థ సిద్ధమవుతున్నట్లు సమాచారం. తాజాగా ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనల వ్యవహారం కూడా తెరపైకి రావడంతో మెటాపై నియంత్రణ సంస్థల పరిశీలన మరింత పెరిగింది. చిన్నారుల భద్రతకు ముప్పు కలిగించే కంటెంట్, ప్రకటనల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని కేంద్రం స్పష్టం చేస్తున్న నేపథ్యంలో ఏడు రోజుల్లో మెటా ఇచ్చే వివరణ, ఆ తర్వాత ప్రభుత్వం తీసుకునే చర్యలు కీలకంగా మారనున్నాయి.

# ఈ20 పెట్రోల్ తర్వాత- డీజిల్‌లో 15% ఐసోబ్యూటనాల్ కలపడంపై కేంద్రం దృష్టి

**పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ మిశ్రమ లక్ష్యాన్ని పూర్తి చేసిన భారత్**

**ఇప్పుడు డీజిల్‌లో 15 శాతం ఐసోబ్యూటనాల్ కలిపేందుకు సిద్ధం**

**కీలక ప్రకటన చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ**



పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ (ఙ20) మిశ్రమ లక్ష్యాన్ని నిర్దేశిత గడువు కంటే ముందుగానే విజయవంతంగా పూర్తి చేసిన భారత్ ఇప్పుడు బయోఫ్యూయెల్ రంగంలో మరో కీలక ముందడుగు వేసేందుకు సిద్ధమవుతోంది. డీజిల్‌లో 15 శాతం ఐసోబ్యూటనాల్ మిశ్రమాన్ని కలిపే దిశగా, దీనిని అనుమతించే దిశగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. దేశాన్ని ఇంధన రంగంలో స్వయం సమృద్ధిగా మార్చడం, ముడి చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం సహా కాలుష్యాన్ని నియంత్రించడం ఈ నిర్ణయం వెనుక ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.ప్రత్యామ్నాయ ఇంధనాల అభివృద్ధిపై ప్రభుత్వం రూపొందించిన వ్యూహాన్ని వివరిస్తూ గడ్కరీ కీలక విషయాలు వెల్లడించారు. ప్రస్తుతం పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలపడం కుదిరినా, డీజిల్‌లో నేరుగా ఇథనాల్‌ను కలపడం సాంకేతికంగా సాధ్యపడదని స్పష్టం చేశారు. అందుకే ఇథనాల్‌ను ఆధారంగా చేసుకొని ఐసోబ్యూటనాల్ తయారు చేస్తున్నట్లు వివరించారు. 'ఇథనాల్‌ను డీజిల్‌లో నేరుగా కలపలేం. అందుకే ఇథనాల్ నుంచి ఐసోబ్యూటనాల్‌ను తయారు చేస్తున్నాం. ఇది డీజిల్‌కు మంచి ప్రత్యామ్నాయంగా మారుతుంది' అని గడ్కరీ పేర్కొన్నారు. డీజిల్‌లో గరిష్ఠంగా 15 శాతం ఐసోబ్యూటనాల్ మిశ్రమాన్ని అనుమతించే దిశగా ప్రభుత్వం విధానపరమైన చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు.ఇది అమల్లోకి వస్తే విదేశాల నుంచి ముడి చమురు దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుంది. దేశీయ బయోఫ్యూయెల్ ఉత్పత్తికి ప్రోత్సాహం లభిస్తుంది. కాలుష్య ఉద్గారాలు తగ్గే అవకాశం ఉంటుంది. రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు ఏర్పడతాయి. ఈ సరికొత్త టెక్నాలజీకి సంబంధించి ఇప్పటికే జరిపిన పైలట్ ప్రాజెక్టులు ప్రోత్సాహకరమైన ఫలితాల్ని ఇచ్చాయని కేంద్ర మంత్రి గడ్కరీ వెల్లడించారు. 100 శాతం ఇథనాల్, 100 శాతం ఐసోబ్యూటనాల్‌తో పనిచేసే రెండు జెనరేటర్ సెట్లను తాము విజయవంతంగా నడిపి చూయించామని, ఈ ఇంధనాలతో పనిచేసేలా ఇంజిన్లను సులభంగా అభివృద్ధి చేయొచ్చని ఇది నిరూపించిందని గడ్కరీ స్పష్టం చేశారు.ఐసోబ్యూటనాల్‌ను తదుపరి తరం (నెక్ట్స్ జెనరేషన్) బయోఫ్యూయెల్‌గా నిపుణులు అభివర్ణిస్తున్నారు. దీని ప్రత్యేకతల విషయానికి వస్తే సాధారణ బయోఫ్యూయెల్స్‌తో పోలిస్తే అధిక శక్తి సామర్థ్యం కలిగి ఉంటుంది. ఇది ఇంజిన్లకు పూర్తి అనుకూలంగా ఉండటమే కాకుండా, చాలా తక్కువ ఉద్గారాల్ని విడుదల చేస్తుంది. నిల్వ, రవాణాకు కూడా అనుకూలంగా ఉంది. డీజిల్‌కు సమర్థవంతమైన ప్రత్యామ్నాయంగా ఉంటుంది. దీని వాడకం వల్ల భారత ముడి చమురు దిగుమతి భారం గణనీయంగా తగ్గడమే కాకుండా, ఇంకా దేశీయంగా రైతులు ఉత్పత్తి చేసే బయోఫ్యూయెల్స్‌కు విపరీతమైన డిమాండ్ పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో రవాణా రంగంలో ఐసోబ్యూటనాల్ కీలక ఇంధనంగా మారే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు.ఇథనాల్ బ్లెండింగ్‌పై ఇటీవల సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాల్ని పెట్రోలియం, సహజవాయువుల మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. ఈ నేపథ్యంలో తాజాగా నితిన్ గడ్కరీ ఐసోబ్యూటనాల్ బ్లెండింగ్‌పై వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇథనాల్ తయారీకి అధికంగా నీరు అవసరం అవుతుందని, వాహనాల ఇంజిన్లు దెబ్బతింటాయని, వాహనాల వారంటీ, ఇన్సూరెన్స్ రద్దవుతాయని, పర్యావరణానికి హాని జరుగుతుందనే ప్రచారం జరుగుతుందని పేర్కొంది. అయితే ఇవన్నీ ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేని వాదనలేనని, ఇథనాల్ మిశ్రమ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా అమల్లో ఉన్న ప్రమాణాలు, శాస్త్రీయ అధ్యయనాలు, నియంత్రణ వ్యవస్థల ఆధారంగానే అమలు చేస్తున్నామని కేంద్రం స్పష్టం చేసింది.ఇక కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన గణాంకాల ప్రకారం- భారత్ 2025 డిసెంబరులోనే పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ మిశ్రమ (ఙ20) లక్ష్యాన్ని గడువు కంటే ముందుగానే సాధించింది. అధికారిక గణాంకాల ప్రకారం ఈ కార్యక్రమం ద్వారా రూ. 1.9 లక్షల కోట్లకుపైగా విదేశీ మారక ద్రవ్యం ఆదా అయింది. ఇక పెట్రోల్‌లో ఙ20 విజయవంతంగా అమలైన తర్వాత ఇప్పుడు డీజిల్‌లో 15 శాతం ఐసోబ్యూటనాల్ మిశ్రమం అమల్లోకి వస్తే, భారత ఇంధన రంగంలో మరో పెద్ద మార్పుకు నాంది పలికే అవకాశం ఉందని తెలుస్తోంది.

# "క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీ" గురించి తెలుసా

**కొనుగోలు చేసేముందు ఈ విషయాలు తెలుసుకోవాలట!**

**దీర్ఘకాలిక చికిత్సలకు ఆసరాగా క్రిటికల్ ఇన్సూరెన్స్**

**ఇది ఎలా పని చేస్తుంది ఎలా పొందాలి**




అనుకోని ఆపద సమయంలో అక్కరకు వస్తుందని ప్రస్తుతం చాలా మంది ఆరోగ్య బీమా తీసుకుంటున్నారు. అయితే, నేటి రోజుల్లో మారుతున్న జీవనశైలి కారణంగా వయసుతో సంబంధం లేకుండా గుండెపోటు, క్యాన్సర్, కిడ్నీ వైఫల్యం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వేధిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం సాధారణ హెల్త్ ఇన్సూరెన్స్ మనల్ని పూర్తి ఆర్థికంగా ఆదుకోలేదని నిపుణులు అంటున్నారు. ఎందుకంటే ఈ పాలసీలు కేవలం ఆసుపత్రి ఖర్చులను మాత్రమే భరిస్తాయంటున్నారు. ఈ క్రమంలోనే దీర్ఘకాలిక చికిత్సలు, ఆదాయ నష్టం వంటి ఇతర ఖర్చులను తట్టుకోవడానికి క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీలు ఎంతగానో అవసరం అంటున్నారు. అయితే, వీటిని ఎంచుకునేటప్పుడు, క్లెయిం చేసుకునేటప్పుడు కొన్ని కీలకమైన విషయాలు, ఇబ్బందులపై అవగాహన ఉండాలంటున్నారు. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం.తీవ్ర ఆరోగ్య సమస్యలు ఇబ్బంది పెట్టినప్పుడు కేవలం హాస్పిటల్ ఖర్చులు మాత్రమే కాకుండా, దీర్ఘకాలిక మెడిసిన్ ఖర్చులు, కుటుంబ ప్రయాణాలు, అన్నింటికంటే ముఖ్యంగా బాధితుడి ఇన్‌కమ్ సామర్థ్యం తగ్గిపోవడం వంటి అనేక ఇతర ఖర్చులు ఎదురవుతాయంటున్నారు. సాధారణంగా తీవ్రమైన వ్యాధుల చికిత్స ఖర్చులు మిగిలిన వాటికంటే సగటున మూడు రెట్లు ఎక్కువగా ఉంటాయని.. ఈ ఖాళీని భర్తీ చేసేందుకే క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీలు అందుబాటులో ఉన్నాయంటున్నారు.ఇది స్థిరమైన పరిహారం ఇచ్చే పాలసీ అంటున్నారు నిపుణులు. అంటే, పాలసీలో చెప్పిన ఏదైనా తీవ్రమైన వ్యాధి నిర్ధారణ జరిగిన వెంటనే, హాస్పిటల్ ఖర్చులతో సంబంధం లేకుండా, పాలసీలో ఉన్న పూర్తి మొత్తాన్ని బీమా సంస్థ ఒకేసారి పాలసీదారుడి చేతికి పరిహారం అందిస్తుందని, ఈ డబ్బును పాలసీదారుడు చికిత్స కోసం, లోన్లు క్లియర్ చేయడానికి, ఆదాయం లేని సమయంలో కుటుంబ అవసరాలకైనా ఉపయోగించుకోవచ్చంటున్నారు.ప్రస్తుతం ఉన్న ప్రాథమిక ఆరోగ్య బీమా లేదా టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీకి అదనం ప్రీమియం చెల్లించి రైడర్‌గా జోడించుకోవచ్చంటున్నారు. దీనికి ప్రీమియం తక్కువగా ఉంటుంది. కానీ, ఇందులో ప్రాథమిక పాలసీ విలువ కంటే ఎక్కువ మొత్తానికి కవరేజీని ఎంచుకునే వీలుండదంటున్నారు. బేసిక్ పాలసీ గడువు ముగిస్తే, ఇదీ ముగుస్తుందని చెబుతున్నారు. పూర్తిగా స్వతంత్రంగా ఉండే స్టాండలోన్ క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీనీ ఎంచుకోవచ్చని సలహా ఇస్తున్నారు. ఇందులో ఎక్కువ మొత్తానికి కవరేజీ ఎంచుకునే వెసులుబాటు ఉంటుందని, వ్యాధుల జాబితా కూడా ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు.క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీలను ఎంచుకునే ముందు నిబంధనలను పరిశీలించాలని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ధూమపానం, మద్యపానం, డ్రగ్స్ వాడకం వల్ల వచ్చే వ్యాధులకు ఈ బీమా వర్తించదని అంటున్నారు. అలాగే పుట్టుకతో వచ్చే లోపాలు, ప్రసవ సంబంధిత సమస్యల్లాంటివి ఈ పాలసీ పరిధిలోకి రావంటున్నారు. ఇక కొన్ని రకాల క్యాన్సర్ల ప్రారంభ దశలో పాలసీ వర్తించదని.. వ్యాధి తీవ్రత పెరిగినప్పుడే క్లెయిమ్ చేసుకునేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.తీవ్ర వ్యాధులకు వర్తించే క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీ తీసుకున్న వెంటనే క్లెయిం చేయడానికి వీలుండదని.. వెయిటింగ్ పీరియడ్ ఉంటుందని చెబుతున్నారు. సాధారణంగా పాలసీ ప్రారంభమైన మొదటి 3 నుంచి 6 నెలల వరకూ (నిబంధనల మేరకు) ఎలాంటి క్లెయిములు అంగీకరించరంటున్నారు.ఇక వ్యాధి నిర్ధారణ అయ్యాక కనీసం 30 రోజుల వరకూ జీవించి ఉండాలనే నిబంధనా కొన్ని పాలసీల్లో ఉంటుందని తెలుపుతున్నారు.ఆరోగ్య బీమా పాలసీలో ఏటా ప్రీమియం చెల్లించి రెన్యూవల్ చేసుకోవచ్చు. క్లెయిమ్ చేసుకున్నా పునరుద్ధరణకు ఇబ్బంది లేదు. కానీ క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీ పూర్తిగా భిన్నం అంటున్నారు నిపుణులు. ఈ పాలసీలో ఒకసారి క్లెయిమ్ మొత్తం చెల్లించిన తర్వాత పాలసీ రద్దవుతుందని.. ఒకవేళ పాలసీదారునికి ఒకటి కంటే ఎక్కువ తీవ్రమైన వ్యాధులు ఒకేసారి వచ్చినా, ఒకసారి మాత్రమే చెల్లింపు ఉంటుందని అంటున్నారు. క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీ సాధారణ ఆరోగ్య బీమాకు ప్రత్యామ్నాయం కాదని.. ఇది ఒక అదనపు రక్షణ కవచం మాత్రమే అంటున్నారు. ఏజ్ పెరిగే కొద్దీ ప్రీమియం ధర కూడా పెరుగుతుందని, ఈ క్రమంలోనే చిన్న వయసులోనే తక్కువ ప్రీమియంతో క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీని తీసుకోవడం మేలంటున్నారు.

# టాటా ఈవీ కార్లపై భారీ డిస్కౌంట్లు

**జూలైలో రూ.3.35 లక్షల వరకు ఆఫర్లు!**

**జూలై నెలలో టాటా ఈవీ కార్లపై భారీ డిస్కౌంట్లు**

**టాటా కర్వ్ ఈవీపై గరిష్టంగా రూ.3.35 లక్షల వరకు ప్రయోజనాలు**

**హారియర్, పంచ్, టియాగో ఈవీలపైనా ఆకర్షణీయమైన ఆఫర్లు**

**అమ్మకాలు పెంచుకుని మార్కెట్లో ఆధిక్యం నిలబెట్టుకునేందుకు కంపెనీ వ్యూహం**



దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్, తన ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) విక్రయాలను పెంచుకునే దిశగా జూలై నెలలో భారీ డిస్కౌంట్లను ప్రకటించింది. విస్తరిస్తున్న ఈవీ మార్కెట్లో తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకునే లక్ష్యంతో, ఎంపిక చేసిన మోడళ్లపై గరిష్టంగా రూ. 3.35 లక్షల వరకు ప్రయోజనాలను కల్పిస్తోంది.ఈ ఆఫర్లలో నగదు తగ్గింపు, ఎక్స్ఛేంజ్ బోనస్, స్క్రాపేజ్ ప్రయోజనాలు మరియు లాయల్టీ ఇన్సెంటివ్‌లు అంతర్భాగంగా ఉన్నాయి. ముఖ్యంగా టాటా కర్వ్ ఈవీపై గరిష్టంగా రూ. 3.35 లక్షల వరకు ప్రయోజనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా, ఎంపిక చేసిన నాన్-ఎక్స్ సిరీస్ వేరియంట్లపై రూ. 3 లక్షల వరకు నగదు తగ్గింపుతో పాటు ఎక్స్ఛేంజ్ లేదా స్క్రాపేజ్ బోనస్‌లు లభించనున్నాయి.టాటా హారియర్ ఈవీ ఈ మోడల్‌పై ప్రత్యక్ష నగదు తగ్గింపు లేనప్పటికీ, ఎక్స్ఛేంజ్/స్క్రాపేజ్ మరియు లాయల్టీ బోనస్‌ల రూపంలో రూ. 2.75 లక్షల వరకు ప్రయోజనాలను పొందవచ్చు.టాటా పంచ్ ఈవీ:లిలి లాంగ్ రేంజ్ వేరియంట్లపై రూ. 1.45 లక్షల వరకు, మిడ్ రేంజ్ వేరియంట్లపై రూ. 1.25 లక్షల వరకు ఆదా చేసుకునే అవకాశం ఉంది.టాటా టియాగో ఈవీ:లిలి పాత మోడళ్లపై రూ. 1.45 లక్షల వరకు, వీ= మరియు ౫= వేరియంట్లపై రూ. 65,000 నుంచి రూ. 1 లక్ష వరకు ప్రయోజనాలు అందుబాటులో ఉన్నాయి.టాటా నెక్సాన్ ఈవీ:లిలి ఈ మోడల్‌పై రూ. 15,000 నగదు తగ్గింపుతో పాటు ఇతర ఆఫర్ల ద్వారా కలిపి మొత్తం రూ. 50,000 వరకు ప్రయోజనాలను కంపెనీ అందిస్తోంది.గత జూన్ నెలలోనూ ఇలాంటి ఆఫర్లనే ప్రకటించిన టాటా మోటార్స్, పోటీ మార్కెట్లో అమ్మకాల జోరును కొనసాగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, ఈ ఆఫర్లు షోరూం, భౌగోళిక ప్రాంతం మరియు స్టాక్ లభ్యతను బట్టి మారే అవకాశం ఉంటుంది. కాబట్టి, కొనుగోలుదారులు పూర్తి వివరాల కోసం సమీపంలోని అధీకృత డీలర్‌షిప్‌ను సంప్రదించవలసిందిగా సూచించడమైనది.

# టాప్ 5 ఐటీ దిగ్గజాలకు సమానంగా

**ఒక్క రిలయన్స్ మార్కెట్ విలువ!**

**ఐదు టాప్ ఐటీ కంపెనీల ఉమ్మడి విలువకు చేరువైన రిలయన్స్**

**రూ.18 లక్షల కోట్లకు చేరిన రిలయన్స్ మార్కెట్ క్యాప్**

**ఏఐ భయాలు, అంతర్జాతీయ ఒత్తిళ్లతో కుదేలైన ఐటీ రంగం**

**ఈ ఏడాది రిలయన్స్ షేర్లు కూడా 17 శాతం మేర పతనం**

**టాప్-5 ఐటీ కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.18.12 లక్షల కోట్లు**




భారత కార్పొరేట్ రంగంలో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ముఖేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) మార్కెట్ విలువ, దేశంలోని ఐదు అగ్రశ్రేణి ఐటీ కంపెనీల ఉమ్మడి మార్కెట్ విలువకు దాదాపు సమానంగా చేరింది. ఐటీ రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న తరుణంలో, రిలయన్స్ ఈ అరుదైన మైలురాయిని చేరుకోవడం గమనార్హం.శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి రిలయన్స్ మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు రూ.18 లక్షల కోట్లుగా నమోదైంది. అదే సమయంలో, దేశంలోని టాప్-5 ఐటీ దిగ్గజాలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, టెక్ మహీంద్రాల ఉమ్మడి మార్కెట్ విలువ రూ.18.12 లక్షల కోట్లుగా ఉంది. కొన్నేళ్ల క్రితం వరకు టీసీఎస్ ఒక్కటే రిలయన్స్ కంటే ఎక్కువ మార్కెట్ విలువను కలిగి ఉండేది, కానీ ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి.2026లో ఐటీ స్టాక్స్ తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వల్ల సంప్రదాయ ఐటీ సేవలకు ముప్పు వాటిల్లుతుందన్న ఆందోళనలు, అంతర్జాతీయంగా టెక్నాలజీ వ్యయం తగ్గడం, ఆర్థిక అనిశ్చితి వంటి కారణాలతో ఈ కంపెనీల షేర్లు ఈ ఏడాదిలో ఇప్పటివరకు 36 శాతం వరకు పతనమయ్యాయి.అయితే, రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా ఈ ఒడిదొడుకులకు అతీతంగా ఏమీ లేదు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌లోని మార్పులు, ముఖ్యంగా ఇరాన్-అమెరికా ఉద్రిక్తతల ప్రభావంతో ఈ ఏడాది రిలయన్స్ షేరు విలువ సుమారు 17 శాతం మేర క్షీణించింది. గత నెలలో 52 వారాల కనిష్ఠ స్థాయి రూ.1,253.20కి పడిపోయిన షేరు ధర, ప్రస్తుతం రూ.1,304 వద్ద ట్రేడ్ అవుతోంది.మరోవైపు, రిలయన్స్ తన వ్యాపార వైవిధ్యీకరణను మరింత వేగవంతం చేస్తోంది. ఇటీవలి వార్షిక సర్వసభ్య సమావేశంలో ప్రకటించినట్లుగా, అప్పుల చెల్లింపుల కోసం రూ.35,000-40,000 కోట్ల భారీ లక్ష్యంతో జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీవోకు రంగం సిద్ధం చేస్తోంది.

# బంగారం, వెండి ధరలు

**తెలుగు రాష్ట్రాల్లో రేట్లు ఇవే!**

**తెలుగు రాష్ట్రాల్లో స్థిరంగా కొనసాగుతున్న బంగారం ధరలు**

**హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1,46,720**

**22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర రూ.1,34,490**


**స్వల్పంగా తగ్గిన వెండి.. కేజీపై రూ.100 క్షీణత**

ఈరోజు ఉదయం భారత మార్కెట్‌లో బంగారం ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ విపణిలో డిమాండ్ నిలకడగా ఉండటంతో పసిడి ధరల్లో పెద్దగా మార్పులు చోటుచేసుకోలేదు. అయితే, వెండి ధర మాత్రం స్వల్పంగా తగ్గింది. కిలో వెండిపై రూ.100 తగ్గి, ప్రస్తుతం రూ.2,59,900 వద్ద ట్రేడ్ అవుతోంది.హైదరాబాద్, విజయవాడ మార్కెట్లలో సోమవారం ఉదయం నాటికి 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,46,720గా ఉంది. అదేవిధంగా, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర రూ.1,34,490 వద్ద నిలకడగా కొనసాగుతోంది. నిజామాబాద్, ఖమ్మం, వరంగల్, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి వంటి ప్రధాన నగరాల్లోనూ ఇవే ధరలు అమలవుతున్నాయి. ఇక 18 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,10,040గా నమోదైంది.దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో బంగారం ధరలను పరిశీలిస్తే, చెన్నైలో 24 క్యారెట్ల పసిడి ధర అత్యధికంగా రూ.1,49,450గా ఉంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో రూ.1,46,870గా ఉండగా, ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో హైదరాబాద్ తరహాలోనే రూ.1,46,720 వద్ద ధరలు కొనసాగుతున్నాయి.బంగారం కొనుగోలుదారులు స్థానిక నగల దుకాణాల్లో ధరలను మరోసారి సరిచూసుకోవడం ఉత్తమం. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ధరల్లో ఎప్పటికప్పుడు హెచ్చుతగ్గులు చోటుచేసుకునే అవకాశం ఉంటుందని గమనించాలి.



## ‘అయ్యగారే నెం.1’ నినాదంపై అఖిల్ స్పందన.. నాకు నంబర్ వన్ కావాలనే లక్ష్యం లేదంటూ కామెంట్


అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘లెనిన్’ విడుదలకు సిద్ధమవుతోంది. జూలై 10న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా అఖిల్ వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ తన సినీ ప్రయాణం, అభిమానులతో ఉన్న అనుబంధం, కెరీర్‌పై తన ఆలోచనలను పంచుకుంటున్నారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో “అయ్యగారే నెం.1” అనే నినాదంపై ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో “అయ్యగారే నెం.1c అంటూ వైరల్ అయిన అభిమాని గురించి మాట్లాడుతూ అఖిల్ ఆనందం వ్యక్తం చేశారు. ఒక అభిమాని తనపై చూపించిన ప్రేమ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎక్కడికి వెళ్లినా అందరూ ‘అయ్యగారు... అయ్యగారు’ అని పిలుస్తున్నారు. ఈ పేరు నాకు అభిమానులు ఇచ్చిన ప్రేమకు నిదర్శనం. నాన్న నాగార్జునకు ‘కింగ్’ అనే ప్రత్యేక గుర్తింపు ఉన్నట్లే, నాకు ‘అయ్యగారు’ అనే పేరు సహజంగానే వచ్చేసింది. ఇది నాకు ఎంతో ప్రత్యేకమైన గుర్తింపు” అని అఖిల్ చెప్పారు. అభిమానులు తరచూ “అయ్యగారే నెం.1c అని అనడం గురించి స్పందిస్తూ అఖిల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిజం చెప్పాలంటే ‘నంబర్ వన్’ కావాలనే లక్ష్యం నాకు లేదు. నంబర్ వన్ అనేది ప్రతి ఒక్కరి అభిప్రాయం మీద ఆధారపడి ఉంటుంది. ఒకరికి నంబర్ వన్ అనిపించే వ్యక్తి, మరొకరికి కాకపోవచ్చు. అందుకే ఆ పోలికల గురించి నేను ఎక్కువగా ఆలోచించను” అని స్పష్టం చేశారు. తనపై అభిమానులు చూపిస్తున్న ప్రేమ తనకు మరింత బాధ్యతను పెంచుతుందని అఖిల్ అన్నారు. అభిమానులు నాపై ఇంత ప్రేమ చూపిస్తున్నప్పుడు, వారి అంచనాలను అందుకోవాలనే బాధ్యత కూడా నాపై ఉంటుంది. వారి ప్రేమ, ఉత్సాహం నాకు మరింత కష్టపడేలా ప్రేరణ ఇస్తాయి. వారిని ఎప్పుడూ నిరాశపరచకూడదనేదే నా ప్రయత్నం అని చెప్పారు. తెలుగు సినీ అభిమానుల్లో కొన్ని ప్రత్యేక నినాదాలు చిరస్థాయిగా నిలిచిపోయాయని చెబుతూ, “జై బాలయ్య” తరహాలో “అయ్యగారే నెం.1” కూడా తనతో ఎప్పటికీ ముడిపడి ఉండిపోతుందని అఖిల్ ఆనందం వ్యక్తం చేశారు. ఇంటర్వ్యూలో తన గత చిత్రాలైన ‘హలో’, ‘మిస్టర్ మజ్ను’, ‘మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్’ గురించి కూడా అఖిల్ మాట్లాడారు. ఆ సినిమాల్లో తాను పోషించిన పాత్రలు మహిళలను గౌరవించే యువకులుగా ఉండటం తనకు ఎంతో నచ్చిందన్నారు. ముఖ్యంగా ‘మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్’ చిత్రంలోని హర్ష పాత్ర గురించి మాట్లాడుతూ, ఆ పాత్రలో ఉన్న విలువలు ప్రతి అమ్మాయి కోరుకునే లక్షణాలు. అలాంటి పాత్ర చేయడం నాకు ఎంతో సంతృప్తినిచ్చింది అని తెలిపారు.



## ఓఆర్ఆర్ వద్ద పది ఎకరాలు కొనొచ్చు

సత్యదేవ్ హీరోగా వచ్చిన లేటేస్ట్ మూవీ రావు బహదూర్. ఈ నెల 3న థియేటర్లలో రిలీజైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సక్సెస్ టాక్‌తో దూసుకెళ్తోంది. ఈ చిత్రంలో సత్యదేవ్‌కు జంటగా దీపా థామస్ హీరోయిన్‌గా మెప్పించింది. ఈ మూవీకి కేరాఫ్ కంచరపాలెం ఫేమ్ వెంకటేష్ మహా దర్శకత్వం వహించారు. మహేశ్ బాబు--నమ్రతా శిరోద్కర్ జీఎంబీ ఎంటర్‌టైన్ మెంట్ సమర్పణలో ఏ ప్లస్ ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్ మెంట్స్ బ్యానర్స్ చింతా గోపాలకృష్ణా రెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర నిర్మించారు. ఈనెల 3న థియేటర్లలో రిలీజైన ఈ ?సినిమాకు తొలిరోజు నుంచే పాజిటివ్ టాక్ తెచ్చుకుంటోంది. హిట్ టాక్ రావడంతో జనాలు థియేటర్లకు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలోనే మూవీ టీమ్ హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ ఈవెంట్‌కు హాజరైన సత్యదేవ్ తన సినిమాల గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. గతంలో తన మూవీస్ చాలా నిరాశ పరిచాయని అన్నారు. రావు బహదూర్ లాంటి గొప్ప సినిమాను చూస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. సత్యదేవ్ మాట్లాడుతూ..' గతంలో నా సినిమాలు వచ్చినప్పుడు .. ఇది వర్కవుట్ అవుతుందని చెప్పేవారు. అంతేకాదు ఈ మూవీ హిట్ అయితే మీరు ఓఆర్ఆర్ వద్ద ఓ పది ఎకరాలు కొనొచ్చు అనేవారు. నాకు డిసప్పాయింట్‌మెంట్ అనేది కొత్త కాదు. దాంతో నేను, మహా సహజీవనం చేస్తుంటాం. సక్సెస్ అనేది కొత్త. ఈ రోజు సక్సెస్ వచ్చింది అనే పాయింట్ కంటే.. ఈ సినిమా జనాలు చూడకపోతే ఒక గొప్ప చిత్రాన్ని కోల్పోతారనే ఫీలింగ్ వచ్చింది. ఈ మూవీ జనాలు చూస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు.






## ‘ఫౌజీ’ విజువల్స్ చూసి మైండ్ బ్లాక్ అయింది..

### ప్రభాస్ సినిమాపై నాగవంశీ షాకింగ్ కామెంట్స్!

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, ‘సీతారామం’ ఫేమ్ దర్శకుడు హను రాఘవపూడి కాంబినేషన్‌లో రాబోతున్న హిస్టారికల్ పీరియడ్ వార్ అండ్ లవ్ డ్రామా ‘ఫౌజీ’పై రోజురోజుకూ అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. హను రాఘవపూడి కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో మైత్రి మూవీ మేకర్స్ సంస్థ ఈ పాన్-ఇండియా విజువల్ వండర్‌ను నిర్మిస్తోంది. వచ్చే వింటర్ కానుకగా, డిసెంబర్ 2026లో ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే, తాజాగా ఈ సినిమాకు సంబంధించి ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగవంశీ పంచుకున్న ఒక క్రేజీ అప్‌డేట్ ప్రభాస్ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పిస్తోంది. ఒక ఇంటర్వ్యూలో నాగవంశీ మాట్లాడుతూ.. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ తనకు ‘ఫౌజీ’ సినిమాకు సంబంధించిన కొన్ని రషెస్ చూపించారని, అవి చూశాక తనకు మైండ్ బ్లాక్ అయిందని నాగవంశీ పేర్కొన్నారు. చిత్ర యూనిట్ ఈ సినిమాను మనం ఊహించని రేంజ్‌లో, ఒక సరికొత్త హాలీవుడ్ లెవెల్‌లో తెరకెక్కిస్తోందని ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. నాగవంశీ చేసిన ఈ ట్వీట్ సోషల్ మీడియాలో నిమిషాల్లో వైరల్‌గా మారడంతో, ప్రభాస్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వెంటనే సినిమా ప్రమోషన్స్ షురూ చేయాలని, అఫీషియల్ టీజర్ లేదా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేయాలంటూ ఫ్యాన్స్ నెట్టింట ట్రెండ్ చేస్తున్నారు. ఈ అద్భుతమైన చిత్రంతో సోషల్ మీడియా సెన్సేషన్ ఇమాన్వి హీరోయిన్‌గా వెండితెరకు పరిచయమవుతుండటం విశేషం. అలాగే బాలీవుడ్ దిగ్గజ నటులు మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, సీనియర్ నటి జయప్రద, రాహుల్ రవీంద్రన్, చైత్ర జె. ఆచార్ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టించబోతుందో చూడాలి.



## ‘రౌడీ జనార్దన’లో బాలీవుడ్ భామ.. లైగర్ బ్యూటీతో మళ్లీ రౌడీ స్టార్ రొమాన్స్?

టాలీవుడ్ సెన్సేషన్ విజయ్ దేవరకొండ, క్రేజీ డైరెక్టర్ రవి కిరణ్ కోలా కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవేటెడ్ మూవీ ‘రౌడీ జనార్దన’ గురించి రోజుకో ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. పక్కా గ్రామీణ నేపథ్యంలో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని టాలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ సరసన జాతీయ అవార్డు గ్రహీత, స్టార్ హీరోయిన్ కీర్తి సురేశ్ కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకుతున్నాయి. అయితే తాజాగా ఈ సినిమాకు సంబంధించి సోషల్ మీడియాలో ఒక క్రేజీ అప్‌డేట్ తెగ హల్‌చల్ చేస్తోంది. ఈ చిత్రంలో ఒక అదిరిపోయే మాస్ స్పెషల్ సాంగ్ ప్లాన్ చేస్తున్నారట. ఈ స్పెషల్ సాంగ్‌లో విజయ్ దేవరకొండతో కలిసి బాలీవుడ్ బ్యూటీ అనన్యా పాండే స్టెప్పులు వేయబోతున్నట్లు గట్టిగా వినిపిస్తోంది. గతంలో వీరిద్దరూ ‘లైగర్’ సినిమాలో కలిసి నటించిన సంగతి తెలిసిందే, ఒకవేళ ఈ వార్త నిజమైతే మరోసారి ఈ జోడి వెండితెరపై సందడి చేయడం ఖాయంగా కనిపిస్తోంది. మరి ఈ స్పెషల్ సాంగ్ ఆఫర్‌కు అనన్య గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా లేదా అనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే. ఇదిలా ఉంటే.. ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ ప్రేక్షకులకు పూనకాలు తెప్పించేలా ఉంటాయని ఇన్సైడ్ టాక్. ముఖ్యంగా ఈ ఫ్లాష్ బ్యాక్‌లో విజయ్ దేవరకొండ మునుపెన్నడూ లేని విధంగా ఫుల్ యాక్షన్ మోడ్‌లో ఊరమాస్ లుక్‌తో కనిపించబోతున్నాడట. ఇందులో వచ్చే యాక్షన్ సీక్వెన్సులు సినిమా మొత్తానికే మేజర్ హైలైట్‌గా నిలుస్తాయని చిత్ర యూనిట్ భావిస్తోంది. మరో ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఈ సినిమాలో సీనియర్ యాంగ్రీ యంగ్ మ్యాన్ రాజశేఖర్ ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆయన పాత్రతో పాటు లుక్ కూడా ఇప్పటివరకు మనం చూడని రీతిలో సరికొత్తగా, ఎంతో పవర్‌ఫుల్‌గా డిజైన్ చేశారట. మొత్తానికి భారీ తారాగణం, అదిరిపోయే యాక్షన్ ఎలిమెంట్స్, విలేజ్ బ్యాక్‌డ్రాప్ స్టోరీతో తెరకెక్కుతున్న ‘రౌడీ జనార్దన’ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులను సృష్టిస్తుందో చూడాలి.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.